జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523



సంపుటి 12 సంచిక 231 విశాఖపట్నం | శనివారం 08 మే 2021 | 8 పేజీలు | వెల : 5.00


# ధాన్యం సేకరణలో మిల్లర్ల ప్రమేయం వద్దు:జగన్

- ధాన్యం సేకరణ, రేషన్ బియ్యం డోర్ డెలివరీపై సమీక్ష
- వ్యవసాయ సలహా కమిటీలను యాక్టివేట్ చేయాలి
- డోర్ డెలివరీలో ఎక్కడా ఏ లోపం లేకుండా చూడాలి



అమరావతి, మే 07, ప్రజాపాలన ప్రతినిధి: వ్యవసాయ సలహా కమిటీలను యాక్టివేట్ చేయాలని, అన్ని అంశాలపై వ్యవసాయ సలహా కమిటీలకు పూర్తి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. క్రాప్ ప్లానింగ్ మొదలు రైతులకు అండగా ఆ కమిటీలు ఉండాలన్నారు. ఈ ప్రక్రియలో మహిళా రైతులకు కూడా భాగస్వామ్యం కల్పించాలని చెప్పారు. ధాన్యం సేకరణలో ఎక్కడా మిల్లర్ల ప్రమేయం ఉండొద్దని స్పష్టం చేశారు. ధాన్యం ఏ మిల్లుకు పంపాలన్నది అధికారులే నిర్ణయించాలన్నారు. ఎక్కడా రైతులకు ఏ విధంగానూ నష్టం కలగకూడదని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పక్కాగా ధాన్యం సేకరణ జరగాలని, రేషన్ బియ్యం డోర్ డెలివరీలో ఎక్కడా ఏ లోపం ఉండొద్దని అధికారులను హెచ్చరించారు. ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయంలో ధాన్యం సేకరణ, రేషన్ బియ్యం డోర్ డెలివరీపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు.

**మిల్లర్ల ప్రమేయం వద్దు:**
ధాన్యం సేకరణలో ఎక్కడా మిల్లర్ల ప్రమేయం ఉండకూడదు. ఏ ఊరి పంట ఏ మిల్లర్ దగ్గరకు వెళ్తోంది అన్న విషయం అధికారులకు మాత్రమే తెలియాలి. అందుకు అవసరమైతే జిల్లాల కలెక్టర్లు సొంతంగా గోనె సంచులు సేకరించాలి. ధాన్యం కొనుగోలులో తేమ చూడడం కోసం, ఆర్బీకేల వద్ద ఆ మీటర్లు కూడా ఉన్నాయి. మిల్లుల వద్దకు ధాన్యం రవాణా చేయడంలో వ్యయ నియంత్రణ కోసం ఊరికి దగ్గరలోని మిల్లర్ వద్దకు పంపించవద్దు. అందుకోసం జిల్లా యూనిట్‌గా తీసుకుని, ధాన్యాన్ని మిల్లుల దగ్గరకు పంపించాలి. మనం కొనుగోలు చేస్తామని చెప్పిన టైంకు మనమే కొనుగోలు చేయాలి. మొత్తం ప్రక్రియ అంతా కూడా ప్రభుత్వమే చేపట్టాలి.

**రెండు శాఖలు ఓన్ చేసుకోవాలి:**
ఆర్బీకేకు సంబంధించి వ్యవసాయ శాఖకు ఎంత బాధ్యత ఉందో, పౌర సరఫరాల శాఖకు కూడా అంతే బాధ్యత ఉంది. కాబట్టి రైతు కోరిన విత్తనాలు పౌర సరఫరాల శాఖ ఇవ్వాలి. అందుకోసం పౌర సరఫరాల శాఖ కూడా ఆర్బీకేను ఓన్ చేసుకోవాలి. రైతులు బయట విత్తనాలు కొని మోసపోకుండా వ్యవసాయ శాఖ చూడాలి. వారికి అవసరమైన విత్తనాలు ఆర్బీకేల ద్వారా సరఫరా చేయాలి. ఈ క్రాపింగ్ నుంచి మార్కెటింగ్ వరకూ రెండూ కలిసి పనిచేయాలి

**వ్యవసాయ సలహా కమిటీలు:**
వ్యవసాయ సలహా కమిటీలను యాక్టివేట్ చేయాలి.

(మిగతా 2లో..)



## మార్కెటింగ్ శాఖ అధికారులతో
# మంత్రి కన్నబాబు సమీక్ష

అమరావతి,మే 07, ప్రజాపాలన ప్రతినిధి: మార్కెటింగ్ శాఖ అధికారులతో మంత్రి కన్నబాబు శుక్రవారం రోజున సమీక్ష నిర్వహించారు. కోవిడ్ దృష్ట్యా మామిడి, టమాట మార్కెట్లపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు పండ్ల ధరలపై దృష్టి పెట్టామని మంత్రి కన్నబాబు తెలిపారు. రైతులు మార్కెట్లలోకి రాత్రులు కూడా సరుకులు తీసుకురావచ్చునని మంత్రి కన్నబాబు పేర్కొన్నారు. అంతేకాకుండా మార్కెట్ల నుంచి తిరిగి వెళ్లే వాహనాలకు ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని మంత్రి అధికారులకు సూచించారు. మామిడి ధరలను రోజూ పర్యవేక్షించాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు తెలిపారు. టమాట ధరలు పడిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల టన్నుల టమాటలను ప్రాసెసింగ్ యూనిట్స్ కొలుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. రైతు బజార్లలో మాస్క్ లేకుండా వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని రైతు బజార్లలో 'నో మాస్క్ - నో ఎంట్రీ విధానం' అమలులో ఉంటుందని మంత్రి కన్నబాబు తెలిపారు.

# కర్ణాటకలో రెండు వారాల లాక్‌డౌన్



బెంగళూరు,మే 07, ప్రజాపాలన ప్రతినిధి: ఊహించినట్లే కర్ణాటక కూడా లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయింది. కరోనా సెకండ్ వేవ్‌లో మొత్తం దేశానికి కొత్త కేంద్రంగా మారిన ఈ రాష్ట్రంలో రోజువారీ కేసులు 50 వేల వరకూ చేరుకున్నాయి. దీంతో ఈ నెల 10న (సోమవారం) ఉదయం 6 గంటల నుంచి ఈ నెల 24 ఉదయం 6 గంటల వరకూ పూర్తి లాక్‌డౌన్ విధిస్తున్నట్లు ముఖ్యమంత్రి యెడ్యూరప్ప శుక్రవారం ప్రకటించారు. కరోనా కర్ఫ్యూ పెట్టిన పెద్దగా ఫలితం లేకపోయిందని ఆయన అన్నారు. అన్ని హోటళ్లు, పబ్బులు, బార్లు మూసి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఇక హోటళ్లు, మాంసం దుకాణాలు, కూరగాయల దుకాణాలు మాత్రం ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకూ తెరిచి ఉంటాయని చెప్పారు.

## సినీ గ్లామర్ కు కాలం చెల్లినట్టేనా..?



(వివరాలు 2లో..)

# ఉద్యోగుల పనివేళల్లో మార్పు!



అమరావతి,మే 07, ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్ కట్టడే లక్ష్యంగా రాష్ట్రంలో కర్ఫ్యూ అమల్లో ఉన్న విషయం తెలిసిందే. ప్రజలు కూడా స్వచ్ఛందంగా కర్ఫ్యూలో పాల్గొంటున్నారు. ఉద్యోగుల దృష్ట్యా ఏపీ ప్రభుత్వం మరో నిర్ణయాన్ని తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగుల పనివేళలను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రోజున ఉత్తర్వులను జారీ చేసింది. కర్ఫ్యూ నేపథ్యంలో ఉద్యోగుల పనివేళలు ఉదయం 8 గంటల నుంచి 11.30 వరకు ఉండాలని నిర్ణయించింది.రాష్ట్రంలోని అన్ని హెచ్‌డీవో కార్యాలయాలు, సెక్రటెరియట్, జిల్లా కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఈ మేరకు అమలులో రానుంది. మధ్యాహ్నం 12 గంటల తరువాత ఉండాలంటే ఉద్యోగులకు కచ్చితంగా పాసులు కలిగి ఉండాలని అధికారులు తెలిపారు. కాగా అత్యవసర సర్వీసులకు ఏపీ ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే.

# ఎన్నికల ఫలితాలపై ఎట్టకేలకు స్పందించిన సోనియాగాంధీ



న్యూఢిల్లీ, మే 07, ప్రజాపాలన ప్రతినిధి: నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతానికి జరిగిన ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఎట్టకేలకు స్పందించారు. ఫలితాలు తీవ్ర నిరాశ కలిగించాయని, ఇలాంటి ఫలితాలను ఊహించలేదని అన్నారు. త్వరలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాన్ని ఏర్పాటు చేసి ఫలితాలపై సమీక్షిస్తామన్నారు."దురదృష్టవశాత్తు అన్ని రాష్ట్రాల్లోనూ మా ప్రదర్శన ఏమంత బాగోలేదు. ఇలాంటి ఫలితాలను ఊహించలేదు. త్వరలోనే ఈ ఫలితాలపై సీడబ్ల్యూసీ సమీక్షిస్తుంది" అని సోనియా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ వర్చువల్ సమావేశంలో సోనియా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో విజయం సాధించిన మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్‌లకు సోనియా శుభాకాంక్షలు తెలిపారు. (మిగతా 2లో..)

# చంద్రబాబు విష ప్రచారం:సజ్జల



అమరావతి,మే 07, ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్ కట్టడిపై చంద్రబాబు నాయుడు విషప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. కొత్త వేరియంట్ అంటూ అసత్య ప్రచారాలు చేసినందు వల్ల ఇప్పటికే ఢిల్లీ, ఒడిశా ప్రభుత్వాలు.. ఏపీ, తెలంగాణ ప్రజల ప్రయాణాలపై నిర్బంధం విధించాయన్నారు. ఎన్440కే స్ట్రెయిన్ వ్యాప్తి అనే అభూత కల్పనను చంద్రబాబు సృష్టించారని, రాజకీయం కోసమే ఇలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కరాష్ట్రంలో కూర్చొని ఏపీని చంద్రబాబు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడం మంచిది కాదని హితవు పలికారు. కోవిడ్ కట్టడికి ఏపీ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందని పునరుద్ఘాటించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన సజ్జల.. "ఎన్440కే అంత ప్రమాదం కాదని శాస్త్రవేత్తలే చెబుతున్నారు. కేరళ లాంటి రాష్ట్రాల్లో ఎన్440కే స్ట్రెయిన్.. చాలా రోజుల నుంచే ఉందని సీసీఎంబీ చెబుతోంది. సీసీఎంబీ, సెంట్రల్ బయో టెక్నాలజీలు.. ఈ స్ట్రెయిన్‌తో ప్రమాదం లేదని ఇప్పటికే స్పష్టం చేశాయి ప్రభుత్వం ఏం మంచి చేసినా విమర్శలు చేయడం చంద్రబాబుకు అలవాటైంది. ఆయన ఏం చేసినా ఎదుర్కొనే శక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉంది. కానీ ఇలా ప్రభుత్వాన్ని విమర్శించడం కోసం ప్రజలను భయపెట్టే విధంగా వ్యవహరించడం తగదు. ఇప్పటికైనా చంద్రబాబు సంయమనంతో మాట్లాడాలి. ప్రభుత్వానికి ప్రతిపక్షనేతగా బాబు సలహాలు ఇవ్వాల్సింది పోయి.. ప్రజలను మరింత భయందోళనలకు గురిచేయడం సరికాదు. చంద్రబాబు చేస్తోన్న విషప్రచారానికి కేసులు పెట్టాలి" అని ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు తీరును విమర్శించారు. ప్రజలు ఎక్కడికక్కడ బాబు నిలదీయాలన్నారు. ఇక కరోనా కట్టడికై ప్రభుత్వం చేపడతున్న చర్యల గురించి మాట్లాడుతూ.. "ఏపీలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయి. టీకా డోసులు కావాలని ఎప్పటికప్పుడు కేంద్రానికి సీఎం లేఖలు రాస్తున్నారు వ్యాక్సిన్లు ఎవరి నియంత్రణలో ఉన్నాయో చంద్రబాబుకు తెలియదా? మొదటగా ఏపీకి 25 లక్షల టీకాలు కావాలని.. ఆ తర్వాత 60 లక్షల టీకాలు కావాలని కేంద్రానికి లేఖలు రాశాం. కేంద్రం సరిపడా డోసులు ఇస్తే అందరికి ఇచ్చేస్తాం" అని సజ్జల పేర్కొన్నారు.


"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్

BUSSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని
చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను
మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై పూలే | జై భీమ్ | జై బహుజన | జై భారత్

# ఏపీలో కరోనా రోగుల పరిస్థితి దారుణం

ఏలూరు, తిరుపతి, మే 7, :కరోనా సెకండ్ వేవ్ తో ఆంధ్రప్రదేశ్ అతలాకుతలమవుతోంది. చిత్తూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పరిస్థితి అంతకంతకూ దిగజారుతోంది. ఆస్పత్రులన్ని కరోనా రోగులతో నిండిపోయాయి. కొత్తగా వచ్చిన రోగులకు పడకలు లేవు. తగినంత మంది వైద్య సిబ్బంది లేరు. దీంతో అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రులకు వస్తున్న రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆస్పత్రుల్లో చోటు, సౌకర్యాలు లేకపోవడంతో వరండాలు, అంబులెన్స్ లోనే ఆక్సిజన్ సిలిండర్లు పెట్టుకుని రోగులు ప్రాణాలు నిలుపుకుంటున్నారు. ఆక్సిజన్ సిలిండర్లను ఆస్పత్రుల గోడలకు, గ్రిల్స్, అంబులెన్స్ లకు బిగించుకుని ఊపరి తీసుకుంటున్నారు. కుర్చీలు, వరండాలోని ఖాళీ ప్రదేశాలు ఆస్పత్రుల బయట బారులు తీరిన అంబులెన్స్ లు ఇలా క్కడబడితే అక్కడ రోగులు అవస్థలు పడుతున్న దృశ్యాలు కుటుంబ సభ్యులు, బంధువుల్లోనే కాదు చూస్తున్న వారందరికీ కంటతడి పెట్టిస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధిక కేసులు చిత్తూరు జిల్లాలోనే నమోదవుతున్నాయి. కరోనా మరణాల సంఖ్యం వెయ్యికి చేరువలో ఉంది. ఎక్కడికక్కడ ఆస్పత్రులన్నీ బాధితులతో నిండిపోతున్నాయి. పెరుగుతున్న బాధితుల సంఖ్యకు తగ్గట్లుగా పడకల సంఖ్య పెంచే వీలులేకపోవడంతో బాధితులు ఆస్పత్రి బయటే నరకయాతన అనుభవిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో నమోదవుతున్న కేసుల్లో మూడో వంతు తిరుపతిలోనివి కావడం గమనార్హం. పద్మావతి కోవిడ్ ఆస్పత్రి, రుయా కోవిడ్ ఆస్పత్రులన్నీ కరోనా రోగులతో నిండిపోయాయి. ఈఎన్ఐ, ఆయుర్వేద ఆస్పత్రులన్నింటినీ కోవిడ్ ఆస్పత్రులుగా మార్చివేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్ని కలిపి 33 చోట్ల చికిత్స అందిస్తున్నారు. వాటితోపాటు కొన్ని క్వారంటైన్ కేంద్రాలు కూడా ఉన్నాయి. మొత్తంగా కలిపి జిల్లాలో 5 నుంచి 6 వేల పడకలు ఉన్నాయి. ఇవన్నీ కూడా నిండిపోవడంతో కొత్తగా వచ్చే రోగులకు చికిత్స అందించే వీలు లేక వైద్య సిబ్బంది ఒత్తిడి పెరుగుతుంది. రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య సిబ్బందికి కేటాయించిన కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో పడకలున్నప్పటికీ డబ్బులు ఇచ్చే వారిని మాత్రమే చేర్చుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో రోజుకు దాదాపు 2 వేల కేసులు నమోదవుతున్నాయి. పాజిటివ్ కేసులు ఇలాగే పెరిగితే దయనీయ పరిస్థితులు ఏర్పడుతాయన్న భయాందోళన జిల్లా ప్రజల్లో నెలకొంది. అటు ఏలూరులోనే కరోనా రోగులు పడరాని పాటు పడుతున్నారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పడకలన్నీ నిండిపోయాయి. దీంతో వరండాలోని బెంచులు, అంబులెన్స్ లో రోగులకు వైద్యం అందిస్తున్నారు. వైద్య సిబ్బంది సరిపడా లేకపోవడంతో కుటుంబ సభ్య?లు, బంధువులే ఆక్సిజన్ సిలిండర్లు సమకూర్చుకొని అంబులెన్స్ లో చికిత్స చేస్తున్నారు. ఆస్పత్రులో చేరేందుకు గంటలు, రోజుల తరబడి నిరీక్షించాలన్ని పరిస్థితి ఏర్పడింది.

# పొన్నూరు లో మరో కోవిడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు:విశాలాంధ్ర





పొన్నూరు,మే 07, ప్రజాపాలన ప్రతినిధి:పొన్నూరు లో ఇప్పటికే కోవిడ్ కంట్రోల్ కు సంబంధించి రెండు క్వారెంటీన్ సెంటర్లు ను ఏర్పాటు చేసిన అధికారులు శుక్రవారం మరో సెంటరు ను పరిశీలించారు. నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకటి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన కేంద్రాలు కోవిడ్ రోగుల డిమాండ్ కు చాలడం లేదని తెలుసుకున్న తహశీల్దార్ డి.పద్మనాభుడు శుక్రవారం పాఠశాల లోనే మరో కేంద్రాన్ని ఏర్పాట్లు పరిశీలించారు. పొన్నూరు శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య సూచనల ప్రకారం వై ఎస్ ఆర్ సి పి పార్టీ తరఫున నియమించిన కమిటీ సభ్యులు స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ లో త్వరలో ప్రారంభమవుతున్న క్వారం టైన్ సెంటర్ ను పరిశీలించి, ప్రతి రూమ్ కు తగిన సౌకర్యాలు, ఏర్పాటు చేయబోయే బెడ్లు, పరుపులు వాటి వివరాలు పరిశీలించడం జరిగింది. పొన్నూరు తహశీల్దార్ పద్మనాభుడు తో కలసి కమిటీ సభ్యులు త్వరలో ఏర్పాటు చేయబోతున్న క్వారంటైన్ సెంటర్ ను పర్యవేక్షించటంతో పాటు, అమలు చేయబోయే భవిష్యత్ ప్రణాళికను గూర్చి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు కొల్లేరు శ్రీనివాస్ రావు, కోవిడ్ కమాండ్ కంట్రోల్ కమిటీ సభ్యులు ప్రగడ బాలాజీ, గేరా సంజీవ్, జాలాది యానాది రావు, ముద్రగడ తిరుపతయ్య, పిల్లి మాణిక్యరావు, మిక్కిలి యోబు, కందుల సుబ్బారావు, అక్కి నాగరాజు, షేక్ నాజర్, ,వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయ ప్రతినిధి మోపర్తి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వివాదంలో గంటా సతీమణి

శ్రీకాకుళం, మే 7,:విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కాపు సామాజికవర్గానికి చెందిన నాయకుడు అన్నది అందరికీ తెలిసిందే. ఆయన ప్రకాశం జిల్లా నుంచి విశాఖకు వలస వచ్చారు. ఇక ఆయన కమ్మ సామాజికవర్గానికి చెందిన ఆమెను వివాహం చేసుకున్న సంగతి అయితే చాలా మందికి తెలియదు. కానీ ఆయన అచ్చమైన కాపు నాయకుడు అని భావిస్తారు. అయితే వేరే కులానికి చెందిన వారికి చేసుకోవడంలో తప్పు ఏమీ లేదు. అంతే కాదు ఆయనకు టీడీపీ రాజకీయాల్లో కూడా అది చాలా ఉపయోగపడిందని కూడా చెబుతారు. ఇదిలా ఉంటే అటు టీడీపీకి దూరంగా ఇటు వైసీపీలో చేరకుండా గంటా శ్రీనివాసరావు సొంత పాలిటిక్స్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇక గంటా శ్రీనివాసరావుని రాజకీయాల్లో నిత్యం విమర్శించే వారిలో ఎంపీ విజయసాయిరెడ్డి ముందుంటారు. ఇపుడు ఆయన అనూహ్యంగా గంటా సతీమణి శారదను కూడా వివాదంలోకి లాగేశారు. గంటా భీమిలీ నుంచి ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్నపుడు సింహాచలం దేవస్థానంలో అవసరమే లేకపోయినా కూడా పెద్ద ఎత్తున అవుట్ సోర్సింగ్ పోస్టులను భర్తీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇది ఏకంగా సింహాచలం దేవస్థానం ఖజానాకు కూడా పెనుభారంగా మారిందని అన్న మాట ఉంది. వారిని ఇపుడు తీసేయడానికి వైసీపీ చూస్తూంటే పెద్ద ఎత్తున గొడవలు అవుతున్నాయి. దాంతో విజయసాయిరెడ్డి దీని మీద గట్టిగానే గంటా శ్రీనివాసరావును తగులుకున్నారు. ఇదంతా చేసింది గంటా సతీమణి మేడం చౌదరి గారు అంటూ సెటైరికల్ గా కామెంట్స్ చేశారు. ఈ పోస్టుల భర్తీ వెనక ఆవె ఉన్నారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. అదిపుడు రాజకీయ రచ్చగా మారుతోంది. గంటా శ్రీనివాసరావు తనకు ఉన్న బలమైన కాపుల దన్ను చూసుకుని ఫ్యూచర్ పాలిటిక్స్ చేద్దామని ఆలోచిస్తున్నారు. ఆయన ఏపీవ్యాప్తంగా కాపులకు తాను పెద్ద నాయకుడిని అని కూడా ఫీల్ అవుతారు. అటువంటి గంటా శ్రీనివాసరావు సగం కాపు తప్ప పూర్తి కాపు కాదు అన్నది చెప్పాలన్న ఆలోచనతోనే విజయసాయిరెడ్డి ఈ రకంగా ఆయన వైవాహిక బంధం వెనక ఉన్న కులం గుట్టు విప్పారు అన్న మాట వినిపిస్తోంది. ఇంతకాలం గంటాను విమర్శించే ఆయన ఇపుడు ఏకంగా ఆయన సతీమణిని కూడా వివాదంలోకి లాగడం వెనక రాజకీయ ఎత్తుగడలే ఉన్నాయని చెబుతున్నారు. గంటా శ్రీనివాసరావు వైసీపీలో చేరుతారని మొదట చెప్పింది విజయసాయిరెడ్డే. మరి లోపాయికారిగా ఏం జరిగిందే తెలియదు విజయసాయిరెడ్డి అంతటి వాడు మీడియా ముందు స్టేట్మెంట్ ఇచ్చాడు అంటే ఆయనకు ఆధారాలు ఉంటాయి కదా అన్న మాట ఉంది. అయితే సాయిరెడ్డి ప్రకటించిన తరువాత గంటా శ్రీనివాసరావు తాను వైసీపీలో చేరడంలేదు అని ఖండించేశారు. దాంతో వైసీపీ పరువు పోయింది. ఇక జగన్ నుంచి కూడా ఈ విషయంలో గట్టిగానే సాయిరెడ్డికి క్లాస్ తీసుకున్నట్లుగా ప్రచారం జరిగింది. ఆ మంటతోనే గంటా శ్రీనివాసరావు మీద విమర్శల జోరు పెంచేసిన విజయసాయిరెడ్డి ఇపుడు ఏకంగా ఆయన ఫ్యామిలీని కూడా లాగి కులబలం కూడా ఆయనకు దక్కకుండా మంత్రాంగం నడుపుతున్నారని అంటున్నారు. మరి చూడాలి దీనికి గంటా శ్రీనివాసరావు నుంచి ఏ విధమైన రిటార్ట్ వస్తుందో.

## ఆస్పత్రిలో బెడ్ ఇప్పిస్తామంటూ వృద్ధుడికి రూ.20 వేలు టోకరా

నాగ్‌పూర్: కరోనా పేషెంట్‌కు బెడ్ ఇప్పిస్తామంటూ ఘరానా కేటుగాళ్లు ఓ వృద్ధుడి నుంచి రూ.20 వేలు దండుకున్న వైనమిది. డబ్బులు కట్టిన తర్వాత మరింత డబ్బు కావాలంటూ డిమాండ్ చేయడంతో ఆ పెద్దాయన చివరికి పోలీసులను ఆశ్రయించారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. బాధితుడు అమరేంద్ర నారాయణ్ సింగ్ (60) భార్య కరోనా బారిన పడడంతో ఇటీవల ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ఆమె పరిస్థితి ఏమాత్రం మెరుగవ్వకపోవడంతో మరో ఆస్పత్రికి తరలించాలని ఆయన నిర్ణయించుకున్నారు. రాహుల్ కుమార్ అనే వ్యక్తి ఆస్పత్రుల్లో బెడ్స్ ఇప్పిస్తున్నాడనీ.. అతడితో మాట్లాడమంటూ అమరేంద్ర బంధువు ఒకరు ఆయనకు ఓ ఫోన్ నంబర్ ఇచ్చారు. రాహుల్ కుమార్‌కు బాధితుడు ఫోన్ చేయడంతో.. గురువారం సాయంత్రానికల్లా బెడ్ బుక్ చేస్తానంటూ అతడు నమ్మబలికాడు. బెడ్ కోసం రూ.20 వేలు తన బ్యాంకు ఖాతాకు పంపాలని అడగడంతో... అమరేంద్ర అతడికి రూ. 20 వేలు పంపించారు. అయితే ఆ డబ్బు సరిపోదనీ.. మరింత డబ్బు పంపించాలంటూ రాహుల్ కుమార్ డిమాండ్ చేయడంతో తాను మోసపోయానని బాధితుడికి అర్థమైంది. నేరుగా ఆ ఆస్పత్రికి ఆయన ఫోన్ చేసి ఆరాతీయడంతో.. అక్కడ రాహుల్ కుమార్ అనే వ్యక్తే లేడని తెలిసింది. దీంతో సదరు వృద్ధుడు ఇవాళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 420తో పాటు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశామనీ.. త్వరలోనే అతడిని పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

# తమ్ముళ్ల వితండవాదం

విజయవాడ, మే 7, :వైసీపీకి, టీడీపీకి మధ్య ఉన్న వివాదాలు, విభేదాలు అందరికీ తెలిసిందే. ఏ పక్షం నాయకులు నోరు విప్పినా.. ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు కావొచ్చు లేదా.. ఇతర విషయాలు కావొచ్చు.. ఇరు పక్షాల మధ్య మాటల యుద్ధం కామన్. అయితే.. ఇప్పుడు ఈ క్రమంలోనే టీడీపీలో ఒక వితండ వాదం తెరమీదికి వచ్చింది. అదేంటంటే.. ఏపీలో జగన్ ప్రభుత్వానికి వ్యూహం లేదని.. తాము చేస్తున్న డిమాండ్లనే.. కొద్ది రోజుల తేడాతో అమలు చేస్తున్నారని.. అంటున్నారు. టీడీపీ నేతలు రెండు ఉదాహరణలు చెబుతున్నారు. రాష్ట్రంలో కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జగన్ ప్రభుత్వం ప్రజలను గాలికి వదిలేసి.. తన పబ్బం గడుపుకొందని.. ఈ క్రమంలో రాష్ట్రంలో కరోనా తీవ్రత పెరిగిపోయిందని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలోనే తమ పార్టీ అధినేత , మాజీ సీఎం చంద్రబాబు కీలక సలహా ఇచ్చారని.. రాష్ట్ర వ్యాప్తంగా కర్ఫ్యూను పటిష్టంగా అమలు చేయాలని సూచించారని అంటున్నారు. అయితే.. రాష్ట్ర సర్కారు మాత్రం ఈ విషయంలో మొండిగానే వ్యవహరించినా.. తర్వాత తర్వాత టీడీపీ అధినేత చెప్పినట్టే చేశారని అంటున్నారు. ఇక, నారా లోకేష్ విషయంలోనూ ఇలానే జరిగిందని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇంటర్ పరీక్షల విషయంలో ప్రభుత్వం జోరుగా నిర్ణయం తీసుకుందని.. ఎట్టి పరిస్థితిలోనూ ఆపేది లేదని స్పష్టం చేసిందని.. అయితే.. లోకేష్ మాత్రం పరీక్షల కారణంగా.. రాష్ట్రంలో కరోనా తీవ్రత మరింత పెరుగుతుందన్న విషయాన్ని స్పష్టం చేశారని.. ఈ క్రమంలోనే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా అభిప్రాయ సేకరణ చేసి.. ప్రభుత్వానికి నివేదించారని.. అయినా కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. అయితే.. ఇప్పుడు మాత్రం తాజాగా పరీక్షలు వాయిదా వేస్తూ.. తీసుకున్న నిర్ణయం కేవలం.. లోకేష్ డిమాండేనని చెబుతున్నారు. మొత్తంగా ఈ రెండే కాకుండా.. ప్రభుత్వ వైద్యశాలలో పడకల పెంపు కూడా ఈ కోవలేదని అంటున్నారు. అంటే.. టీడీపీ బాటలోనే వైసీపీ నడుస్తోందనే వాదనకు బలం చూకూరుతోందని అంటున్నారు.

## ధాన్యం సేకరణలో మిల్లర్ల ప్రమేయం వద్దు:జగన్

(మొదటి పేజీ తరువాయి)

ఆ మేరకు ఆ కమిటీలకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలి. క్రాప్ ప్లానింగ్ మొదలు ఆ కమిటీలు రైతులకు అండగా నిలవాలి. వ్యవసాయ సలహా కమిటీలు గ్రామాల్లో ఆర్బీకేలతో కలిసి పని చేయాలి. అన్నింటిలోనూ మహిళా రైతుల ప్రమేయం కూడా ఉండాలి. ఆ కమిటీల బాధ్యతలు. వాటి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలి. రాష్ట్ర స్థాయిలో ఈ ప్రక్రియను పౌర సరఫరాల శాఖ మంత్రి పర్యవేక్షిస్తారు. ఎక్కడా రైతు ఇబ్బంది పడకూడదు.

**రైతులకు ప్రత్యామ్నాయం చూపాలి:**

ఏ విత్తనం వేస్తే బాగుంటుంది? ఏది సాగు చేస్తే పంట కొనుగోలు చేస్తారన్నది రైతులకు ఆ కమిటీలు ముందే చెప్పాలి. అలాగే రైతులకు ధాన్యంతో తగిన ఆదాయం రాకపోతే (ఉత్పత్తి పెరిగి ధరలు తగ్గడం వంటి కారణాల వల్ల), ఏ పంట వేస్తే తగిన ఆదాయం వస్తుందన్న విషయాన్ని రైతులకు చెప్పాలి. ఆ మేరకు వారికి ప్రత్యామ్నాయం చూపాలి. అంతే తప్ప రైతుల ఆదాయం మాత్రం తగ్గకూడదు.

**రేషన్ బియ్యం డోర్ డెలివరీ:**

రేషన్ బియ్యం డోర్ డెలివరీలో ఎక్కడా ఏ లోపం లేకుండా చూడాలి. బియ్యం తీసుకోవడంలో ఎవరూ మిస్ కాకుండా చూడాలి. ఆ మేరకు ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్)లు పని చేయాలి. ప్రతి నెలా నిర్ణీత వ్యవధిలోగా తప్పనిసరిగా బియ్యం పంపిణీ జరగాలి. కావాల్సినన్ని వేయింగ్ స్కేల్స్ (తూకం యంత్రాలు) కొనుగోలు చేయండి. బియ్యం క్వాలిటీలో ఎక్కడా కూడా కాంప్రమైజ్ అవ్వద్దు, ఎవరైనా ఇంటి వద్ద రేషన్ మిస్ అయితే గ్రామ, వార్డు సచివాలయంలో తీసుకునేలా చర్యలు తీసుకోవాలి. దీనికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయండి.

## ఎన్నికల ఫలితాలపై ఎట్టకేలకు స్పందించిన సోనియాగాంధీ

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలతో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్ తీవ్ర పరాభవాన్ని ఎదుర్కొంది. తృణమూల్ కాంగ్రెస్ 213 స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ 77 స్థానాలకు పరిమితమైంది. 2016 వరకు అస్సాంపై పట్టు నిలుపుకున్న కాంగ్రెస్ తాజా ఎన్నికల్లో కొంత పరవాలేదనిపించింది. 95 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 29 స్థానాలతో సరిపెట్టుకోగా, ప్రతిపక్ష కూటమి 50 స్థానాలకే పరిమితమైంది. ఎన్డీయే 75 స్థానాలకు కైవసం చేసుకుంది. కేరళలోనూ కాంగ్రెస్‌కు మరోమారు నిరాశే ఎదురైంది. 140 స్థానాలున్న కేరళలో లెఫ్ట్ ఫ్రంట్ 99 స్థానాలు కైవసం చేసుకుని వరుసగా రెండోసారి అధికారంలోకి రాగా, కాంగ్రెస్ కూటమి యూడీఎఫ్ 41 స్థానాలకే పరిమితమైంది. ఇక్కడ బీజేపీ ఖాతా తెరవలేకపోయింది. తమిళనాడులో కాంగ్రెస్ ప్రదర్శన కొంత మెరుగైందనే చెప్పాలి. ఇక్కడ 25 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 18 స్థానాల్లో గెలుపొందింది. అయితే, పాండిచ్చేరిలో మాత్రం అధికారాన్ని నిలబెట్టుకోవడంలో బోల్తా పడింది. గతేడాది అక్టోబరు-నవంబరులో బీహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు పరాజయం ఎదురైంది. అక్కడ 70 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 19 స్థానాల్లో మాత్రమే విజయం సాధించగలిగింది.

## ఇక్కడ మానవత్వం పరిమళించింది

పొన్నూరు, మే 07, ప్రజాపాలన ప్రతినిధి:కరోనా మహమ్మారి కబళించుకు పోతున్న తరుణంలో మృతుల శవాల వద్దకు కన్నబిడ్డలు సైతం రాకుండా వదిలేసి వెళుతున్నారు. భయం అంత్యక్రియలకు దూరం చేస్తోంది. ఇలా ఎన్నో శవాలు అంతిమ యాత్రకు నోచుకోవడం లేదు. ఇలాంటి హృదయ విధారక పరిస్థితుల్లో కొందరు ముస్లిం యువకులు ముందుకు వచ్చి కరోనా మహమ్మారికి బలైన హిందూ మతానికి చెందిన ఒక వృద్ధ మహిళకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ సంఘటన పొన్నూరు మండలం నండూరు గ్రామంలో చోటుచేసుకుంది. కరోనా భయాన్ని కూడా లెక్కచేయకుండా మానవత్వాన్ని చాటుకుని పలువురి అభినందనలు పొందారు. నండూరు గ్రామంలో లక్ష్మిశెట్టి సామ్రాజ్యం (68)అనే వృద్ధురాలు కరోనా బారిన పడి హెూమ్ క్వారెంటీన్ లో చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. అయితే కరోనా భయంతో ఆమె అంత్యక్రియలు జరపడానికి అయిన వారు గాని గ్రామస్తులు గాని ముందుకు రాకపోవడంతో శవం గంటల కొలది అలాగే నిలిచిపోయింది. ఈ విషయాన్ని స్నేహితులు ద్వారా పొన్నూరు కు చెందిన ఎం.ఎం.యూత్,ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ సభ్యులకు తెలిసి వారిలో మానవత్వం పరిమళించింది. శుక్రవారం నాడు తాము రంజాన్ దీక్షలో ఉన్నామన్న సంగతి ప్రక్కన బెట్టి హుటాహుటిన బయలుదేరి నండూరు గ్రామానికి తరలి వెళ్లారు. హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు అన్నీ పూర్తి చేశారు. తామే ఆమెకు కన్నబిడ్డలై పాడిగట్టి శవాన్ని స్మశానానికి మోసుకెళుతుంటే నండూరు గ్రామంలో ఇది ఒక గొప్ప సంచలనానికి దారితీసింది. ఆమె అంత్యక్రియలు తమదేనన్న శైలిలో నిర్వహించారు. పొన్నూరు వాసులైన మామూ , షబ్బీర్ , తలహా , ఖమ్ము, ఆరిఫ్ మరియు ఎం.ఎం.యూత్ సభ్యులు పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలో ఉండికూడా పర మతాన్ని గౌరవించి హిందు సాంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించిన ఈ ఘటన పలువురి కి స్ఫూర్తి దాయకం గా నిలిచింది.



## ఇలా చేస్తే కరోనా థర్డ్ వేవ్ రాదు: విజయ్‌రాఘవన్

న్యూఢిల్లీ: కఠినమైన చర్యలు తీసుకోవడం వల్ల కరోనా థర్డ్ వేవ్ రాకుండా అడ్డుకోగలమని అన్నారు కేంద్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కే విజయ్‌రాఘవన్. ఇలా చేయడం వల్ల కనీసం అన్ని ప్రాంతాల్లో లేదా ఎక్కడా రాకుండా కూడా అడ్డుకోగలమని ఆయన చెప్పారు. అయితే అది స్థానికంగా అంటే రాష్ట్రాలు, జిల్లాలు, నగరాలు, పల్లెల్లో మార్గదర్శకాలను ఎంత సమర్థంగా అమలు చేస్తున్నారన్నదానిపై ఆధారపడి ఉంటుందని విజయ్‌రాఘవన్ అన్నారు. ఇక కొవిడ్ నుంచి కోలుకున్న వాళ్లలో బ్లాక్ ఫంగస్ లేదా మ్యూకోర్మిసిస్ వస్తుందన్న వార్తలపై స్పందిస్తూ.. దీనిని తాము జాగ్రత్తగా గమనిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇక నీళ్ల ద్వారా కరోనా వ్యాపించదని కూడా ఆయన స్పష్టం చేశారు.

## పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణి

### సొంతనిధులతో నరుకులు అందించిన సర్పంచ్ రామావత్. ప్రమీలభాయి తేజానాయక్



కారంపూడి, మే 07 , ప్రజాపాలన ప్రతినిధి:కనబడని కరోనా శత్రువు తో పోరాడే పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కారంపూడి సర్పంచ్ రామావత్. ప్రమీలభాయి తేజానాయక్ నిత్యావసర సరుకులను స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతి కార్యదర్శి బొగ్గావరపు కాశీవిశ్వనాథం తో కలసి అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామావత్.ప్రమీలభాయి తేజానాయక్ మాట్లాడుతూ కరోనా కారంపూడిలో విజ్రుంబిస్తున్న తరుణంలో కరోనా కట్టడికి గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి సేవాలందిస్తున్న పారిశుధ్య కార్మికులకు తనవంతు సహాయంగా తన సొంత నిధులతో నిత్యావసర సరుకులను పంపిణి చేయటం జరిగిందని కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులకు చేయూత ఇవ్వవలసిన బాధ్యత మనందరి పై ఉందని ఆమె అన్నారు. ఉదయాన్నే 5గంటలకు విధులకు హాజరై గ్రామంలో ఉన్న పరిశుధ్యన్ని మెరుగుపరుస్తారని కారంపూడి పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు తాత్కాలిక, పర్ట్ టైం పద్ధతిలో పనిచేస్తున్నారని వీరికి జీతాలు కూడా తక్కువగా వస్తుంటాయని కరోనా సమయంలో వారిని ఆదుకోవాలన్నా ఉద్దేశంతో పంచాయతీలో పనిచేస్తున్న అందరు పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణి చేయటం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఇదిఇలా ఉండగా వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోమెరా. పిచ్చయ్య ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకుడు వల్లెపు. గోవిందారాజు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కూరగాయలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్వో కృష్ణ ప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యులు కాలే. రాంబాబు,పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రవి,పంచాయతీ సూపర్వైజర్ హాసన్ అహ్మద్, సిబ్బంది హరి, పారిశుధ్య కార్మికులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## కరోనా పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలి :ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

చిలకలూరిపేట, మే 07 , ప్రజాపాలన ప్రతినిధి:చిలకలూరిపేట కొవిడ్ కేర్ సెంటర్‌లోని కరోనా పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వైద్యులను ఆదేశించారు. చిలకలూరిపేట పట్టణంలోని చీరాల రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి, మంచినీటి చెరువుల సమీపంలో టిడ్కో గృహసముదాయం ఆవరణలో ఉన్న కొవిడ్ కేర్ సెంటర్‌లను ఎంపీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కొవిడ్ ఆసుపత్రికి నిధులు విడుదల చేయాలని, ఆక్సిజన్ కొరత, రెమిడెసివర్ ఇంజక్షన్‌ల కొరత తీర్చాలని, వెంటిలేటర్లు ఏర్పాటు, ల్యాబ్ సౌకర్యం, అంబులెన్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని నరసరావుపేట సబ్‌కలెక్టర్‌ను ఫోన్‌లో కోరారు. ఇక్కడ మొత్తం 14 మంది కరోనా పేషెంట్లు ఉన్నారు. వారిలో ఏడుగురికి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండగా మరో ఏడుగురు సాధారణ స్థితిలో ఉన్నారు.అనంతరం పట్టణంలోని 52 ఎకరాలలో ఉన్న కొవిడ్ కేర్ సెంటర్‌ను ఎంపీ తనిఖీ చేశారు. కొవిడ్ పేషెంట్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సౌకర్యాలను పరిశీలించారు. ఏ ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని ప్రభుత్వంతో మాట్లాడి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.





## పేద కోవిడ్ రోగులకు సేవలు అందిస్తున్న పిల్లల డాక్టర్ నాగేశ్వరరావు

### అభినందిస్తున్న పల్నాడు ప్రాంత వాసులు





పల్నాడు, మే 07 , ప్రజాపాలన ప్రతినిధి:కరోనా సమయంలో కోవిడ్ తో అల్లాడుతున్న ప్రజలకు తనవంతు సహాయం అందిస్తూ మంచితనానికి మరు పేరుగా నిలుస్తున్నారు నరసరావుపేట మండలం లింగంగుంట్ల ఏరియా హాస్పిటల్లో వైద్యులు భారతి పిల్లల హాస్పిటల్ అధినేత డాక్టర్. నాగేశ్వరరావు పేదల సాధాక బాధలు తెలిసిన వ్యక్తి కావటంతో కరోనా సమయంలో కోవిడ్ తో అల్లాడుతున్న నిరుపేదలను ఆదుకోవాలన్నా సంకల్పం ఆయన మదిలో ఇమది ఉంది. లింగంగుంట్ల లోని ఏరియా వైద్యశాలలో పనిచేస్తూ ఆసుపత్రికి వచ్చే పేదవర్గాల కోసం తన సొంత నిధులు లక్ష రూపాయల వ్యయంతో వాటర్ ప్లాంట్ ను కూడా నిర్మించాటానికి పునుకున్నారు ఆయన. కరోనా కారణంగా కోవిడ్ తో అల్లడుతున్న ప్రజలకు తనవంతుగా సహాయం అందిస్తూ 65 సెలైన్ స్టాండ్ లను విరాళంగా అందచేసి దానగుణాన్ని చాటుకున్నారు. దీనితో ప్రార్దించే చేతులకన్నా సహాయం చేసే చేతులే మిన్న అనే పదానికి నిదర్శనం డాక్టర్ పిల్లల. నాగేశ్వరరావు గా చెప్పవచ్చు. నరసరావుపేట లో భారతి నర్సింగ్ హోమ్ ను స్థాపించి ఎంతోమంది చిన్నారులకు వైద్యసేవలు అందించారు. కరోనా సమయంలో కరోనాతో బాధపడుతున్న రోగులకు కూడా తనవంతు సహాయంగా సహాయ సహకారాలు అందిస్తూ మంచితనాన్ని చాటుకుంటున్నారు ప్రస్తుతం కోవిడ్ రోగులకు 200 పడకలతో పూర్తి సదుపాయలతో వైద్యసేవలు అందిస్తున్నారు. త్వరలో మరో 70 బెడ్లను పెంచే విధంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. వీటికి సంబంధించిన పనులు కూడా చాకచాక జరుగుతున్నాయి అందులో భాగంగానే ఆక్సిజన్ స్టాండ్ లను విరాళంగా అందజేసారు. ఏది ఏమైనా పల్నాడు ప్రాంతంలో కోవిడ్ రోగులకు సేవలు అందిస్తూ మంచితనానికి మరు పేరు గా నిలుస్తున్న వ్యక్తి డాక్టర్. నాగేశ్వరరావు అని చెప్పటం అక్షర సత్యం అని చెప్పవచ్చు ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి భారతి పిల్లల హాస్పిటల్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## సకాలంలో ఆక్సిజన్ అందిచడం తో తప్పిన పెనుప్రమాదం



విజయవాడ, మే 07 , ప్రజాపాలన ప్రతినిధి:ఒరిస్సా నుండి విజయవాడ సకాలంలో ఆక్సిజన్ అందించి 400 మంది ప్రాణాలను కాపాడిన ఆంధ్ర ప్రదేశ్ పోలీసులు విజయవాడ జి జి హెచ్ లో ఆక్సిజన్ తో చికిత్స పొందుతున్న సుమారు నాలుగు వందల మంది కోవిడ్ భాదితులు ఆక్సీజను కోసం ఎదురుచూస్తున్న సందర్భంలో 18టన్నుల తో వస్తున్న ఆక్సిజన్ ట్యాంకర్ అర్ధరాత్రి దాటిన తర్వాత ట్రాకింగ్ వ్యవస్థతో సంబంధాలు తెగిపోయినాయి. .విజయవాడ సిటీ కమిషనర్ కి సమాచారాన్ని చేరవేసిన సంబంధిత అధికారులు. హుటాహుటిన రంగంలోకి దిగిన విజయవాడ సి.పి ఒరిస్సా నుండి విజయవాడ వరకు ఉన్న అన్ని మార్గ మధ్యలో ఉన్న జిల్లా ఎస్పీలను అప్రమత్తం చేసిన సిపి. ఈస్ట్ గోదావరి జిల్లా, ధర్మవరం వద్ద ఓ డాబా లో ఆక్సిజన్ ట్యాంకర్ ని గుర్తించిన ప్రత్తిపాడు పోలీసులు వివరాలు సేకరించారు. నిరంతరా యంగా ఆక్సిజన్ సరఫరా లో నిమగ్నం అవడంతో అలసిపోయి వాహనాన్ని నిలిపి వేసినట్టుగా పత్తిపాడు సిఐ కి డ్రైవర్ వివరించాడు.సిఐ ట్యాంకరు డ్రైవర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళటంతో అధికారులు తక్షణమే స్పపందించి ఆక్సిజన్ ట్యాంకర్ కు గ్రీన్ చానల్ ఏర్పాటు ఆదేశాలు ఇవ్వడం జరిగింది.డ్రైవర్ కి తోడుగా అనుభవం కలిగిన హొంగార్డుతో ఆక్సిజన్ ట్యాంకర్ ను గ్రీన్ ఛానల్ ద్వారా సురక్షితంగా విజయవాడ జి.జి. హెచ్ కి చేర్చారు.మరోసారి ప్రజాసేవలో తమ బాద్యతను సక్రమంగా నిర్వహించిన పోలీసుల లో ఉన్న మానవత్వాన్ని చాటిచెప్పిన పోలీసులకు డిజిపి మనస్పూర్తిగా అభినందనలు తెలిపారు.

## పాస్టర్లకు రూ .5 వేల రూపాయలు గౌరవ వేతనం-జిల్లా కలెక్టరు ఏ.యండి.ఇంతియాజ్



విజయవాడ,మే 07 , ప్రజాపాలన ప్రతినిధి: జిల్లాలోని పాస్టర్లకు ప్రతీనెలా రూ . 5 వేలు గౌరవ వేతనం అందించడానికి అర్హతగల వారు తమ వివరాలు అందించాలని జిల్లా కలెక్టరు ఏ.యండి . ఇంతియాజ్ అన్నారు . ముఖ్యమంత్రి వై.యస్ . జగన్మోహన రెడ్డి మ్యానిఫెస్టోలో తెలియజేసిన విధంగా ప్రతీనెలా పాస్టర్లకు గౌరవవేతనం అందించాలని , ఇందుకు సంబంధించి మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా అర్హులైన వారి వివరాలను సేకరిస్తున్నారని కలెక్టరు అన్నారు . పాస్టర్లుగా గౌరవ వేతనం పొందుటకు ప్రభుత్వం కొన్ని నిబంధనలను రూపొందించిందని దీనిలో భాగంగా 1. చర్చిస్థలం , చర్చి సొసైటీ చట్టం క్రింద నమోదు చేసి ఉండాలని , 2. చర్చిభూమి చర్చి పేరుతో రిజిష్టర్ అయి ఉండాలని , 3. చర్చికి ఎటువంటి ఆదాయం ఉండకూడదని , ఈ మూడు నిబంధనలను లోబడి అర్హతగల పాస్టర్లు ఈ నెల 11 వ తేదీలోగా నవశకం పోర్టల్ లో వివరాలు నమోదు చేసుకోవాలని కలెక్టరు అన్నారు . జిల్లాలోని వార్డు గ్రామ సచివాలయాల్లో వాలంటీర్ల ద్వారా నవశకం పోర్టల్ నందు వివరాలను అప్ లోడ్ చేసుకోవాలని , తర్వాత అర్హతగల పాస్టర్లను గుర్తించి ప్రతీ నెలా రూ . 5 వేల రూపాయలు గౌరవ వేతనం ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టరు ఏ.యండి . ఇంతియాజ్ అన్నారు.

## వడదెబ్బతో వృద్ధురాలు మృతి-5000 ఆర్థిక సహాయం అందించిన వెన్న సీతారామిరెడ్డి



బెల్లంకొండ, మే 07 , ప్రజాపాలన ప్రతినిధి:ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే నూక్తి ఒక వ్యక్తి హృదయాన్ని కదిలించటంతొ ఒక పేద కుటుంబానికి నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వేన్నా సీతారామిరెడ్డి మట్టి ఖర్చుల కొరకు రూ 5000 సహాయం చేశారు. నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ బి వయస్సు( 95 ) అనే వృద్ధురాలు గురువారం సాయంత్రం వడదెబ్బతో మృతి చెందింది. ఆ కుటుంబం పేద కుటుంబం కావడంతో తన వంతు సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తిప్పి రెడ్డి .కిచ్చారెడ్డి, షావలి ఎరికలయ్యా, పొన్న వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ స్మృతివనం బడ్జెట్ నిధులను కరోనా భాధితుల ప్రాణాలు కాపాడేందుకు వినియోగించండి: కొర్రపాటి సురేష్



గుంటూరు, మే 07 , ప్రజాపాలన ప్రతినిధి: ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి భారత రాజ్యాంగ నిర్మాత డా బి ఆర్ అంబేడ్కర్ గారి స్మృతివనం నిర్మాణానికి 260 కోట్లతో రేపు అనగా మే 7 న టెండర్లకు నోటిఫికేషన్ ఇస్తామన్న నేపధ్యంలో ప్రస్తుతం కరోనా మారణహోమంతో ఆసుపత్రులలో ఆక్సిజన్ సదుపాయాలు లేక బెడ్లు లేక ప్రాణాలు కోల్పోతూ హృదయవిదారకర ఘటనలు చోటు చేసుకుంటున్నాయని.అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ బడ్జెట్ ను తక్షణమే కరోనా భాధితుల ప్రాణాలు కాపాడేందుకు వినియోగించాలని ఇప్పటికే నవరత్నాల పథకాల అమలుతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానా గండిపడి కరోనా విపత్తులో ప్రజల ప్రాణాలు కాపాడలేకపోతున్నారని.అంబేడ్కర్ స్పూర్తితో భవిష్యత్తులో ప్రపంచ స్థాయి లో విరాజిల్లేలా నిర్మాణం చేపట్టవచ్చునని ఈ సంక్షోభంలో స్మృతివనం బడ్జెట్ కరోనా నివారణకు ప్రజల ప్రాణాలు కాపాడేందకు వినియోగిస్తే నిలబడే ప్రతి ప్రాణం ఆ మహనీయునికి ఘన నివాళి అని.అంబేడ్కర్ ని ప్రపంచ స్థాయిలో ప్రజల మనసులలో ఏనాడో గుడి కట్టి ఆరాధించుకుంటున్నారని.మానవత్వానికి ప్రజాస్వామ్యానికి ప్రతిరూపమైన అంబేడ్కర్ వారసులుగా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తామని.రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి తక్షణమే నిర్ణణయాన్ని వెల్లడించాలని కోరుతున్నామని మాలమహానాడు రాష్ట్ర కన్వీనర్ కొర్రపాటి సురేష్ తెలిపారు.






## కోవిడ్ బాధితులకి అండగా ఎందాకైనా... మీ కోనా..!



బాపట్ల మే 07 , ప్రజాపాలన ప్రతినిధి:అనేక అనుమానలతో మాములు జ్వరమా లేక కరోనా వందా ప్రశ్నలతో తికమక పడేవారికి మేము అండగా ఉండి మీ అనుమాలను నివృత్తి చేస్తాము మీకు మేమువున్నాము అధైర్యా పడవద్దు అంటున్న ఉపసభపతి కోన రఘుపతి మరియు డాక్టర్స్, వై సి పి నాయకులు నరాలశెట్టి ప్రకాష్ తదితరులు దెబ్బ తగిలిన వారికి నయం కావడానికి మందుతో పాటు, ఓదార్పు అందించే ఒక ఆత్మీయ స్పర్శ కూడ ఎంతో అవసరం అని సరిగ్గా ఇదే అవసరం కోవిడ్ -19 బాధితులకి ఉందన్న విషయాన్ని గుర్తించిన ఏపీ డిప్యూటీ స్పీకర్ కోనా రఘుపతి,ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు!కరోనా లక్షణాలతో బాధపడుతూ, వైద్య సహాయం కోసం ఎదురు చూస్తున్న వారికి....జలుబు - దగ్గు- జ్వరం స్వల్ప లక్షణాలతో తమకి కరోనా ఉందో లేదో తెలియక సందేహంతో సతమతమవుతున్న వారికి...మీరు ఒంటరి కాదు- మీ వెంట మేమున్నాంలి అంటూ, 6 గురు డాక్టర్లతో టీమ్ ను ఏర్పాటు చేసి, ఏకకాలంలో 3 చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేయించారు.!!టౌన్ హాలులో.. 96 మంది, మునిసిపల్ హైస్కూలులో.. 86 మంది, రైలుపేట సచివాలయంలో .. 149 మంది, మొత్తం 331 మందిలి ఈ శిబిరాలను వినియోగించుకున్నారు. రేపు కూడ శిబిరం కొనసాగనుంది.దీనిని బట్టే అర్థం అవుతుంది కోన నిర్ణయాలు ఎంత పర్ఫెక్టో తెలియడానికి....!!! (శిబిరానికి రాలేని వారికి 24/7 టెలి మెడికల్ సర్వీస్ అందుబాటులో ఉంచారు)

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 08, మే 2021

# బెంగాల్ బాటలో భారత్ నడుస్తుందా..?

వర్తమాన భారతదేశపు అగ్రగామి నాయక ద్వయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా. సర్వసాధకుడయిన మహా శక్తిమంతుడుగా మోదీ నీరాజనాలు అందుకుంటుండగా భారతీయ జనతాపార్టీ ప్రధాన వ్యూహకర్తగా అమిత్ షా గణుతికెక్కారు. ఈ ఇరువురూ అజేయులని వారి అభిమానులు, మద్దతుదారులు ఏడేళ్ళుగా టాంటాం చేస్తున్నారు. నడిచిన చరిత్ర ఈ ప్రచార అతిశయతను పూర్తిగా తిరస్కరించలేకపోయింది. నరేంద్ర మోదీ, ఆయన పాలనానమూనాకు 'అచ్ఛే దిన్', 'నవ' భారత్ అనేవి పర్యాయపదాలుగా ప్రజల పిచ్చాపాటీలో తరచు ప్రస్తావితమవుతుండగా అమిత్ షా ఆధునిక చాణక్యుడిగా రాజకీయ వర్గాన్ని అదరగొడుతున్నారు. అయితే కాలం సదా ఒకలా ఉండదు. గత నెల ఈ నాయకద్వయం కీర్తికిరీటాలు కూలిపోయాయి. ఉగ్రతాండవం చేస్తున్న కరోనా విశ్రమి ప్రధానమంత్రి పాలనాశైలిపై పలు క్లిష్ట ప్రశ్నలు లేవనెత్తగా పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ పరాజయం అపర చాణక్యుడి వ్యూహచాతుర్యాన్ని అభాసుపాలు చేసింది. కొవిడ్ 2.0 ఒక 'భయంకర బాధల పాటల పల్లవి'. ఆ బాధలు అంత తేలిగ్గా ఉపశమించేవి కావు. ఆ మహమ్మారి ఎవరి పట్ల దయాదాక్షిణ్యాలు చూపదు. అయితే ఆ భయానక విపత్తుపై పోరు విషాదగతుల పాలవడం వెనుక కేంద్రంలోని పాలకుల బాధ్యతారాహిత్యం లేదనగలమా? జనసందోహాలు అపారంగా గుమిగూడే కుంభమేళా లాంటి ఉత్సవాలకు అనుమతివ్వడం, తీరూతెన్నూ లేని టీకా విధానం, ఆక్సిజన్ సరఫరాలో అవకతవకలు, పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన ప్రతి సందర్భంలోనూ తడబడడం లేదా అసంబద్ధ వైఖరిని అవలంభించడం మొదలైనవన్నీ కొవిడ్ మహోగ్రరూపం దాల్చడానికి దారితీశాయి. న్యాయస్థానాలు పదే పదే హెచ్చరిస్తే గానీ ప్రభుత్వం చురుగ్గా చర్యలు చేపట్టకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? పాలనలో ఉద్యోగస్వామ్య ధోరణులు పెచ్చరిల్లిపోవడమే అందుకొక ప్రధాన కారణం. కొవిడ్ బాధితుల వాస్తవ సమస్యలపై అవగాహన లేకుండా తాము చేపట్టిన చర్యలపై సంతృప్తితో ఉండడం, అవశ్యం చేయవలసిన వాటి విషయంలో అహంకారపూరిత నిర్లక్ష్యం చూపడమూ కొవిడ్ సంక్షోభాన్ని విషమింప చేశాయి. సామాజిక మాధ్యమాల్లో బీజేపీ దళాలు తరచు 'పప్పు' అని అధిక్షేపించే రాహుల్ గాంధీ మొదటి నుంచీ, కొవిడ్ నివారణ విషయమై ప్రభుత్వానికి చేస్తున్న హెచ్చరికలు సహేతుకమైనవని రుజువు కావడం కూడా అధికారపక్షానికి మరింత ఇబ్బందికర పరిస్థితులను సృష్టించింది. సరే, గుజరాత్ అభివృద్ధి నమూనా గురించి బీజేపీ వర్గాలు ఘనంగా చెప్పని రోజంటూ ఉన్నదా? మరి కరోనా సంక్షోభ వేళ గుజరాత్‌లో పరిస్థితులు ఏమిటి? ప్రభుత్వ ఆసుపత్రుల వెలుపల బారులు తీరిన బాధితులు, ఆసుపత్రుల్లో కనీస సదుపాయాల కొరత అందరికీ పలు కఠోర వాస్తవాలను చెప్పకనే చెప్పేశాయి. ప్రజారోగ్యరంగంలో కనీసస్థాయిలో కూడా మదుపు చేయని అభివృద్ధి నమూనా ఎవరి శ్రేయస్సు కోసం? గుజరాత్ అభివృద్ధి నమూనాలోని గర్హనీయమైన, సమర్థించలేని లొసుగులు ఇప్పుడు దేశప్రజలందరికీ వెల్లడయ్యాయి. పశ్చిమబెంగాల్‌లో సైతం ప్రచార అతిశయతే ప్రాధాన్యం పొందింది. యుద్ధం ప్రారంభం కాకముందే 'వచ్చాం, చూశాం, జయించాం' అన్న గర్వాతిశయాన్ని బీజేపీ వర్గాలు ప్రదర్శించాయి. అపార వనరులు, వ్యవస్థాగత మద్దతు, మీడియా మెరుపు యుద్ధాలు మొదలైనవి బెంగాల్లో బీజేపీ ఘనవిజయం సాధించనున్నదని దేశప్రజలు అనుకునేలా చేశాయి. అయితే వాస్తవమేమిటి? 2019 సార్వత్రక ఎన్నికలలో బీజేపీ గణనీయమైన విజయాలను సొంతం చేసుకున్న మాట నిజమే. ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఉన్న ప్రజాబలం సన్నగిల్లిపోయిందని, అసెంబ్లీ ఎన్నికలలో ఆమె పరాజయం ఖాయమని బీజేపీ వర్గాలు అహంకరించాయి. ముఖ్యంగా అమిత్‌షాకు బెంగాల్‌ను గెలుచుకోవడం అనేది ఒక జీవిత లక్ష్యమైపోయింది. అందుకే ఆయన బెంగాల్ విషయంలో ఎనలేని శ్రద్ధ చూపారు. మరి ఆయన కేంద్ర హోంమంత్రి కదా! పార్టీ ప్రచార బాధ్యతలను నిర్వర్తించేందుకు అమిత్ షా హోంమంత్రిగా తన బాధ్యతలను విస్మరించారు. ప్రజలను వేధిస్తున్న కొవిడ్ సమస్యలను ఉపేక్షించారు. తన శక్తియుక్తులను పూర్తిస్థాయిలో పార్టీ ప్రచారానికే వినియోగించారు. దేశవ్యాప్తంగా సకల రాష్ట్రాలలో అమలవుతున్న కొవిడ్ ఉపశమన కార్యక్రమాలను సమన్వయపరచడంపై ఆయన ఉపేక్ష వహించారు. ప్రతిపక్షం అధికారంలో ఉన్న మరో రాష్ట్రాన్ని బీజేపీ పాలనా ఛత్రం కిందకు తీసుకురావడమే ఆయన ఏకైక లక్ష్యమైపోయింది. నార్త్ బ్లాక్ (కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నెలవు)లో తిష్ఠ వేసి, దేశ వ్యవహారాలను పర్యవేక్షించి, చక్కదిద్దాల్సిన అమిత్ షా బెంగాల్ పట్టణాలు, గ్రామసీమల్లో రోడ్ షోల నిర్వహణకు ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. వందలు వేలు, లక్షల సంఖ్యలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దురదృష్ట మేమింటే అంత మంది ప్రజలు ?ఒక చోటకు వచ్చినప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, సామాజిక దూరాన్ని పాటించేలా చూడాలన్న కరోనా నిబంధనను ప్రతి ఒక్కరూ కచ్చితంగా అనుసరించేలా చేయలేకపోయారు. పత్యర్థుల దాడిలో గాయపడి వీల్ చైర్‌కే పరిమితమవ్వాల్సి వచ్చినా ముఖ్యమంత్రి మమత మొక్కవోని దీక్షతో అలానే ప్రచారం చేసి బీజేపీ బలాధ్యులను సమర్థంగా అడ్డుకోవడం బెంగాలీ ఉపజాతీయవాద భావోద్వేగాల ప్రభావ ఫలితమే. 'బయట నుంచి' వచ్చిన హిందీ మాట్లాడేవారు బెంగాలీ సంస్కృతిలో పుట్టి పెరిగిన బెంగాల్ తనయకు సాటి ఎలా అవుతారు? బెంగాలీలు మమత వైపు మొగ్గటం ద్వారా తమ విలక్షణతను నిలబెట్టుకున్నారు. మరి 'నెంబర్ వన్ దేశ నాయక ద్వయం' తిరోగమిస్తుందా? అవును, కాదు అనేది ఆ ప్రశ్నకు సమాధానం. మహమ్మారిని అదుపు చేయడంలో మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ ప్రధానమంత్రి ఆసేతు హిమాచలం యావద్భారతీయుల ఆదరాభిమానాలు పొందుతున్న ఏకైక నాయకుడిగా ఉన్నారు. ఈ దేశ ప్రజలతో ఆయనకు గల అనుబంధం రాత్రికిరాత్రే ఆవిరైపోలేదు, పోదు కూడా. పక్కా రాజకీయవేత్త అయిన అమిత్ షా ఈ సంవత్సరాంతంలో జరగనున్న ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు సంసిద్ధమవుతున్నారు. ఘటనాఘటన సమర్థులైన ఈ నాయకద్వయం రంగం నుంచి నిష్క్రమించే సమయం ఆసన్నమయిందన్న వార్తలు అత్యుక్తులు మాత్రమే అనడంలో సందేహం లేదు. భారత్ –2024ను బెంగాల్ 2021 ఎలా ప్రతిబింబిస్తుంది? ఎన్నికలు ప్రతిసారీ భిన్నంగా జరుగుతాయి. తదుపరి సార్వత్రక ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ వ్యవధి ఉన్నది. మరి భారతదేశ రాజకీయాలలో మూడేళ్లు అంటే చాలా సుదీర్ఘకాలం సుమా! అయితే మౌలిక ఆరోగ్య సేవలు కుప్పకూలిపోవడం పట్ల ప్రజాగ్రహాన్ని తక్కువగా అంచనా వేయడం రాజకీయ అవివేకమే అవుతుంది. లక్షలాది ప్రజలు వెంటిలేటర్‌పై ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం ఒంటిస్తంభపు మేడలో ఉండకూడదని ఢిల్లీ హైకోర్టు సరిగానే హెచ్చరించింది. ఆక్సిజన్, ఐసియు పడకల కోసం ప్రజలు అల్లల్లాడిపోతున్నప్పుడు వారిని చిత్తశుద్ధితో ఆదుకోవడం ప్రభుత్వ విధ్యుక్తధర్మం. సహానుభూతి, సహజ వివేకంతో ఈ నైతిక కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. అలాకాకుండా ఉద్యోగస్వామ్య ఉదాసీనత, జిత్తులమారి తనపు నిర్వహణా దృక్పథంతో వ్యవహరిస్తే సమస్య సమసిపోదు. ప్రజల బాధలు తీరవు. పాలకులపై విమర్శలు 'జాతి వ్యతిరేకం' అని భావించే నిరంకుశాధికార తత్వం ప్రమాదకరమయింది ఆక్సిజన్ కోసం దేశప్రజలు కొట్టుమిట్టాడుతున్నప్పుడు ప్రధానమంత్రి చేయవలసిందేమిటి? వైద్యశాస్త్రం, వ్యాపారరంగం, రాజకీయాలు మొదలైన విభిన్న రంగాలలో ఉత్కృష్ట సేవలు చేస్తున్న వారందరితో ఒక కమిటీనేర్పాటు చేసి సమస్య పరిష్కారంలో తప్పులు ఎక్కడ జరిగాయో గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టడాన్ని ప్రోత్సహించడమే కాదూ? అలాగే విధాన నిర్ణయ ప్రక్రియను వికేంద్రీకరించడానికి ఇది సరైన సమయం కాదూ? తమతో విభేదిస్తున్నప్పటికీ ఉపయోగకరమైన సేవలు అందించగల వారిని కలుపుకుపోవడానికి పాలకులు శ్రద్ధ చూపాలి. దురదృష్టవశాత్తు చేసిన తప్పులను అంగీకరించి, వాటి పర్యవసానాలకు బాధ్యత వహించే పరిణతి 'మహా శక్తిమంతులైన' రాజకీయనాయకులలో చాలా అరుదు. సంభవించిన దుష్పరిణామాలకు బాధ్యతలను ఇతరులపై నెట్టివేయడానికి బదులు నరేంద్ర మోదీ–, అమిత్ షా తాము చేసిన తప్పులను అంగీకరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరు దేనికి జవాబుదారీతనం వహించాలో నిర్ణయించి పాలనలో మార్పులు తీసుకురావాలి. ఆరోగ్యమంత్రి డాక్టర్ హర్షవర్ధన్ విషయాన్నే తీసుకోండి. ఆయన మంచి స్నేహ మర్యాదలు చూపుతారు.. అయితే కొవిడ్ వాస్తవ పరిస్థితులపై ఆయనకు సరైన అవగాహన ఉందా? దేశంలో వ్యాక్సిన్ నిల్వలు సమృద్ధంగా ఉన్నాయని ఆయన గత నెలలో ప్రకటించారు. అయితే అప్పటికే వ్యాక్సిన్ నిల్వలు తగ్గిపోతున్నాయనే ఆందోళన పలు రాష్ట్రాలలో వ్యక్తమవసాగింది. ఈ ఆరోగ్యమంత్రే గత మార్చి తొలిరోజుల్లో 'మనం మహమ్మారి చివరి అంకంలో ఉన్నామని' ఆనందంగా ప్రకటించారు! ఇది బాధ్యతాయుతమైన ప్రకటనేనా? ఒక మంత్రి రాజీనామా, ప్రధానాధికారులను మార్చివేసినంత మాత్రాన కరోనా వ్యాధిని నిరోధించడం సాధ్యం కాదు. అయితే ప్రజల మనోభావాలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందనడానికి అది తప్పకుండా ఒక సూచన అవుతుంది. నరేంద్ర మోదీ సంకల్పం 'అచ్ఛే దిన్'. అది, ఆమ్‌ఆద్మీ స్వప్నం కూడా. ఎంత చక్కటి స్వప్నం! అయితే కరోనా వ్యాధికి బలైన వారి చితిమంటల్లో ఆ స్వప్నం దగ్ధమయింది. ఆ స్వప్నాన్ని ఆవరించుకుని ఉన్న భావోద్వేగాలు భగ్నమైపోయాయి. కొవిడ్ మహమ్మారి ఒక అనూహ్య భయానక విషాదం. ఈ జీవనబీభత్సానికి బాధ్యులు ఎవరని దేశప్రజలు ప్రశ్నిస్తున్నారు. కనీసం ఈ బాధ్యతనైనా మన పాలకులు సరిగ్గా నిర్వర్తిస్తారా?

# ఆపదలో వున్నవారికి భరోసా రెడ్ క్రాస్



ప్రపంచవ్యాప్తంగా పేద ప్రజలు అనేక రకాల సమస్యలతో బాధ పడుతున్నారు. ఆయా దేశాల ప్రభుత్వాలు పేదరికాన్ని తగ్గించడానికి ఎంతో కృషి చేస్తున్నా ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ ఫలాలు అందడం లేదు. వివిధ సమస్యలతో బాధ పడుతున్న పేదలను ఆదుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్న సంస్థ రెడ్ క్రాస్.మే 8 ఒక అంతర్జాతీయ మానవతావాద ఉద్యమం ప్రారంభమయిన రోజు ఆ ఉద్యమం పేరే రెడ్ క్రాస్. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థలో దాదాపు 9.7 కోట్ల మంది సభ్యులు ఉన్నారంటే అది చేసే సేవలు ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ సభ్యులు ప్రపంచవ్యాప్తంగా మానవతావాదాన్ని, మానవుల జీవితాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అను నిత్యం శ్రమిస్తూ వుంటారు. వీరు తమ సేవలు జాతి,మత,కుల,వర్గ,వర్ణ మరియు వయో భేదాలతో నిమిత్తం లేకుండా అందిస్తారు. అందుకే ఆపదలో వున్నవారికి రెడ్ క్రాస్ ఒక భరోసా. మరియు ధీమా. ప్రపంచంలోని అన్ని దేశాలలోని రెడ్ క్రాస్ శాఖలు, యుద్ధ సమయాలలోను మరియు సాధారణ కాలంలోను నిర్విరామంగా పనిచేస్తుంటాయి.రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటుకు బీజం పోషింది, జీన్ హెన్రీ డ్యూనంట్. 1859 జూన్ 24న వ్యాపారం నిమిత్తమై లావర్డి నగరానికి వెళ్ళారు డ్యూనంట్. ఆ సమయంలో ఫ్రాన్స్ ఆస్ట్రియాల మధ్యన జరుగుతున్న యుద్ధం వల్ల గాయపడిన వేలాది స్త్రీ పురుషులు ప్రథమ చికిత్స లేక మరణించడం అతను చూశాడు. హృదయ విదారకమైన ఈ దృశ్యం అతని మనస్సులో చెరగని ముద్ర వేసింది.తన స్వంత పని మరచిపోయి ఆపదలోనున్న వారందరికి సహాయం చేశాడు. యుద్ధం ముగిసాక అతను ప్రజలందరికీ ఇలా విజ్ఞప్తి చేశాడు. ''యుద్ధాలలో గాయపడిన వారందరికి, మిగిలిన వారు సహాయం చేయాలి, ఇది మానవ ధర్మం.'' ఈ విజ్ఞప్తి ప్రజలందరినీ ఆకట్టుకుంది. అలా రెడ్ క్రాస్ సంస్థకు అంకురార్పణ జరిగింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ (ఐ.సి.ఆర్ .సి .)ని 1863 లో స్థాపించారు. ప్రధాన కేంద్రం స్విట్జర్లాండ్‌లోని జెనీవా నగరంలో ఏర్పాటుచేశారు. అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.ఆర్.సి)ను 1919 లో స్థాపించారు, దీని ప్రధాన కేంద్రం కూడా జెనీవాలోనే ఉంది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ (ఐసిఆర్‌సి) వ్యవస్థాపకుడు, మొదటి నోబెల్ శాంతి బహుమతి గ్రహిత జీన్ హెన్రీ డునాంట్ జన్మదినాన్ని పురస్కరించుకుని మే 8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని, రెడ్ క్రెసెంట్ డే లను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.తాజాగా ప్రపంచం కరోనా గుప్పిట నలిగిపోతోంది. కరోనాపై పోరులో మొదటి వరుస యోధులుగా ఉన్న లక్షలాది మంది రెడ్ క్రాస్ వాలంటీర్ల సేవలు చిరస్మరణీయం. అంతే కాక రెడ్ క్రాస్ సంస్థ రక్త దానంతో ఎందరో పేదలకు పునర్జన్మ ఇచ్చిందని చెప్పవచ్చు. ప్రకృతి వైపరీత్యాల బాధితులకు సహాయం, కరోనా వైరస్ వ్యాప్తి నిరోధం కోసం కృషి, విశాఖపట్నంలో తాజాగా జరిగిన గ్యాస్ లీకేజ్ సంఘటనతో బాధపడుతున్న ప్రజలకు సహాయక చర్యలు చేపట్టడంలో వాలంటీర్ల పాత్ర అభినందనీయం. కరోనా సంక్షోభ సమయంలో రెడ్‌క్రాస్ వాలంటీర్లు, ఐఆర్‌సిఎస్ యూనిట్లు ఆహారం, కూరగాయలు, ముఖ ముసుగులు, చేతి తొడుగులు, శానిటైజర్‌లు పంపిణీ చేసి సంక్షోభ సమయంలో తమకు తామే సాటి అని నిరూపించారు.

**డాక్టర్ ఎం డి ఖ్వాజా మొయినొద్దీన్**
**కరీంనగర్,9492791387**

# సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి



కరోనా సెకండ్ వేవ్ నేపథ్యంలో ఆన్లైన్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, వివిధ రకాల పేమెంట్ యాప్స్ అధిక శాతం ప్రజలు వినియోగిస్తున్నారు. బిల్ పేమెంట్స్, వస్తువుల కొనుగోలు, ఫీజుల చెల్లింపులు మొదలగు వాటితోపాటు ఇతర అవసరాలకు కూడా ఆన్లైన్ చెల్లింపులు చేస్తున్నారు. అయితే దీన్ని ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు అమాయకపు ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారు. కాబట్టి సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారుతున్నది. దీని పట్ల అప్రమత్తంగా వుండాలి. ఎందుకంటే అనేక మందికి వారికి తెలియకుండా ఖాతాల్లో డబ్బులు మాయమవుతున్నాయి. ఇప్పుడు ఆన్లైన్ చెల్లింపులు చేస్తున్నవారు జాగ్రత్తలు తీసుకోవాలి. జాగ్రత్తలు పాటిస్తే సైబర్ నేరాలను నుంచి తప్పించుకోవచ్చు. ఈ రోజుల్లో ప్రభుత్వాలు, వివిధ సంస్థలు జన సామర్థ్యం అధికంగా ఉండే ప్రాంతాల్లో ఉచితంగా వైఫై సదుపాయాన్ని కల్పిస్తున్నారు. అయితే పబ్లిక్ వైఫై ఉపయోగించి ఆన్లైన్ బ్యాంకింగ్ చేయవద్దని చేయకూడదు. ఆవిధంగా చేసినట్లయితే హ్యాకర్లు సులువుగా బ్యాంకు ఖాతా వివరాలు చోరీ చేసే అవకాశం ఉంటుంది. అదేవిధంగా పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్స్ వద్ద ఫోన్లకు ఛార్జింగ్ ఉంచడం మంచిది కాదు. తద్వారా మీ డేటాను దొంగిలించే ఛాన్స్ ఉంటుంది. ఎక్కడికైనా వెళ్లినప్పుడు సొంత ఛార్జింగ్ కేబుల్ ను వెళ్ళాలి. బ్యాంకు ఫోన్ నంబర్లు, ఇతర సమాచారం కోసం గూగుల్ లో వెతకడం అంత మంచిది కాదు. ఎల్లప్పుడూ అధికారిక వెబ్సైట్లోనే ఆ వివరాలు తెలుసుకోవడం మంచిది. యాప్ లను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ ప్లే స్టోర్ నుంచి మాత్రమే డౌన్ లోడ్ చేసుకుని ఇన్స్టాల్ చేసుకోవాలి. సోషల్ మీడియాలో కనిపించే లింకుల ద్వారా యాప్ లను డౌన్ లోడ్ చేసుకుంటే ఇబ్బందులు పాలవుతారు. మన ఫోన్ కు వచ్చే సెక్యూరిటీ అప్ డేట్లను ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా ఇన్స్టాల్ చేసుకుంటే హ్యాకర్ల భారిన పడే ప్రమాదం చాలా తక్కువగా ఉంటుంది. సోషల్ మీడియా, ఇంటర్నెట్లో, మెయిల్, ఎస్ఎంఎస్ లలో కనిపించే బ్యాంకు ట్రాన్సాక్షన్లకు సంబంధించిన లింక్ లపై అస్సలు క్లిక్ చేయకూడదు. అన్నీ సరిచూసుకున్న తర్వాతే వాటిపై క్లిక్ చేయడం మంచిది. బ్యాంకింగ్, కేవైసీకి సంబంధించిన వివరాలు సోషల్ మీడియాలో షేర్ చేయడం మంచిది కాదు. అందువల్ల వ్యక్తిగత సమాచారం హ్యాకర్ల పాలయ్యే ప్రమాదం ఉంది. బ్యాంకు ఖాతాలకు సంబంధించి పాస్ వర్డ్ లు చాలా పెద్దవిగా, స్ట్రాంగ్ గా ఉండేలా చూసుకోవాలి. పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన సులువైన పాస్వర్డ్ లను పెట్టుకుంటే ఇబ్బందులు తలెత్తుతాయి. బ్యాంక్ ఆన్ లైన్ ఖాతాలకు సంబంధించిన పాస్ వర్డ్ లను తరచుగా మారుస్తూ ఉండాలి. ఇలా చేస్తే హ్యాకింగ్ బారిన పడే ఛాన్స్ చాలా తక్కువగా ఉంటుంది. మనం రెగ్యులర్ గా వినియోగించే ఈమెయిల్స్, ఫోన్ నంబర్లను మాత్రమే బ్యాంకు ఖాతాలకు లింక్ చేయాలి. లేకపోతే బ్యాంకు నుంచి వచ్చే సెక్యూరిటీ అలర్ట్స్, ఇతర సమాచారాన్ని పొందలేకపోవచ్చు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఎవరైనా మీ ఖాతా, డెబిట్ కార్డుల వివరాలు అడిగితే చెప్పకూడదు. అనుమానం వస్తే వెంటనే బ్యాంకుకు సమాచారం ఇవ్వాలి. మొబైల్ ఫోన్లో వినియోగించుకునే యాప్ లకు అనవసరమైన పర్మిషన్లు ఇవ్వొద్దు. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సైబర్ నేరగాళ్ల. నుంచి తప్పించుకునేందుకు వీలవుతుంది.

**– వాసిలి సురేష్**
**9494615360**

## లింగంగుంట్ల ప్రభుత్వ హాస్పిటల్ లో మెరుగైన వైద్యసేవలు అందించండి

### కలెక్టర్ తో మాట్లాడిన తెదేపా నేత డా.చదలవాడ అరవింద బాబు



నరసరావుపేటమే 07 , ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు కోరారు.కరోనా సెకండ్ వేవ్ వైరస్ విజృంభణ నేపథ్యంలో నరసరావుపేట లింగంగుంట్ల కోవిడ్ హాస్పిటల్ లో కరోనా బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ తో తెదేపా నేత డాక్టర్ చదలవాడ ఫోన్లో మాట్లాడారు.ఈ సందర్భంగా నరసరావుపేట లో కోవిడ్ బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో హాస్పిటల్ లో వైద్య సేవలు అందించేందుకు అదనంగా వైద్యులతో పాటు నర్సులు, సిబ్బందిని నియమించాలని కోరారు. ఆక్సిజన్ సరఫరాను అన్ని కోవిడ్ హాస్పటల్స్ కు యుద్ధప్రాతిపదికన అందించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ హాస్పటల్ లోని రోగులకు పూర్తి వైద్య పరీక్షలు,మందులు,స్కానింగ్ కూడా రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలని అదే విధంగా కరోనా బాధితులకు వైద్య సేవలు అందించేందుకు హాస్పిటల్ లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్,సబ్ కలెక్టర్ లను కోరారు.హాస్పిటల్లో అదనంగా సిబ్బంది పెంపుదల, వసతుల ఏర్పాట్లపై సానుకూలంగా స్పందించ్చినట్లు నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు తెలిపారు.కరోనా విజృంభణ చేస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి కరోనా వ్యాప్తి కాకుండా నియమ నిబంధనలు జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని డా.చదలవాడ సూచించారు.

### కోవిడ్ వ్యాక్సిన్ సెంటర్ గాజిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల



పెనుగంచిప్రోలుమే7(ప్రజాపాలన)పెనుగంచిప్రోలు గ్రా మంలో గవర్నమెంట్ హాస్పిటల్ నందు కోవిడ్ వ్యాక్సి న్ వేయుటకు తగినంత స్థలము లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన మండల అధికా రులు, ఈరోజు హాస్పిటల్ పక్కన గల శ్రీ కాకాని వెంక టరత్నం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల యందు స మావేశం ఏర్పాటు చేసుకొని, శ్రీ కాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కోవిడ్ వ్యాక్సిన్ సెంటర్ గా ప్రకటన చేశారు, మండలంలోని ప్రజలు ఎవరైనా ఇబ్బంది పడకుండా తగు చర్యలు తీసుకో వాలని అన్ని శాఖల వారు చర్చించుకున్నారు, ఈ కా ర్యక్రమంలో పెనుగంచిప్రోలు ఎమ్మార్వో షాకీర్ నిషా బేగం,ఎండిఓ బి. రాజు, యస్ఐ జి.రామకృష్ణ, పెను గంచిప్రోలు పంచాయతీ కార్యదర్శి రాంబాబు,డాక్టర్ అనిల్ కుమార్,ఎం.పి.హెచ్.ఇ.వో సత్యనారాయణ, సి.హెచ్.వో లక్ష్మి పాల్గొన్నారు.

## అటవీశాఖ అధికారి కి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే నంబూరి శంకర్రావు



బెల్లంకొండ: మే 07, ప్రజాపాలన ప్రతినిధి: పెదకూరపాడు నియోజకవర్గంలోని అటవీ శాఖకు సంభందించిన పలు సమస్యలపై జిల్లా అటవీ శాఖ అధికారి యన్ రామచంద్రరావు గారికి వినతి పత్రం అందజేసిన పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు నంబూరు శంకరరావు గారుబెల్లంకొండ మండలం రామాంజనేయపురం గ్రామంలో బోర్లు వేయుటకు, దేవాలయ నిర్మాణానికి, స్కూల్ నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని కోరిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అచ్చంపేట మండలం మాదిపాడు, పెదపాలెం, కొండూరు, నీలేశ్వరపాలెం, మరియు బెల్లంకొండ మండలం రామాంజనేయపురం, మాన్నేసుల్తాన్ పాలెం, వెంకటాయపాలెం, కందిపాడు, బోధనం మొదలగు గ్రామాలలో అటవీ భూమి సేద్యం చేసుకుంటున్న రైతులకు సర్వే చేసి పట్టాలు ఇంపించాలని వారు కోరారు

# హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి:నవతరం డిమాండ్




గుంటూరు., మే 07 , ప్రజాపాలన ప్రతినిధి:కరోనాతో లక్షలాది మంది మరణిస్తున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించడం లేదు. ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయడం లేదని నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రమణ్యం తెలిపారు.డబ్బు సంచులు, బ్రాందీ బాటిల్స్ ,బిర్యానీ ప్యాకెట్లు పంచి,ప్రజల్ని వంచించి, మోసగించి, మభ్యపెట్టి, మాయచేసి ,ప్రజల అవసరాలను,అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఎన్నో ఆశలు కల్పించి గద్దెనెక్కి పాలన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజల ప్రాణాలు నిర్దాక్షిణ్యంగా గాల్లో కలిసిపోతున్నా,వైద్య సౌకర్యాలు అరకొరగా ఉన్నా ఏమాత్రం స్పందించడం లేదని ఆయన బహిరంగ లేఖ రాశారు. నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తున్నారు.ఎన్నికల జాతా మత్తులో మునిగి తేలుతున్నారు. అధికార దాహం తో గంగిరెద్దుల గంతులేస్తున్నారు. భౌతిక దూరానికి కొత్త అర్థాలు చెపుతున్నారు. ర్యాలీలు, బహిరంగ సభలు, కుంభమేళాలు హద్దు అదుపు లేకుండా ఇష్టమొచ్చినట్లు జరుపుతున్నారు. పేదవాళ్ళ ప్రాణాలను గడ్డిపోచతో సమానంగా చూస్తున్నారు. కరోన సెకండ్ వేవ్ తప్పకుండా వస్తుందని ప్రపంచంలోని ఆరోగ్య నిపుణులు గత సంవత్సరం నుండే ఎంత అరిచి గీ పెట్టినా పాలకులు పట్టించుకోలేదనడానికి నిదర్శనం లక్షలాది మంది అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోవడమేన్నారు. దాహమేసిప్పుడు బావి తవ్వుకున్న చందంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పని విధానం కొనసాగుతున్నది.హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించక పోవడం వల్ల యుద్ధప్రాతిపదికన ముందు చూపుతో వైద్య సౌకర్యాలు, వైద్యశాలలు వైద్య నిపుణులను ఏర్పాటు చేసుకోక పోవడం వల్ల సామాన్య ప్రజల దగ్గరి నుండి దేశానికి ఉపయోగపడే ఎంతో మందిమేధావులను,యువకులను, విద్యార్థులను,మహిళలను కోల్పోవడం జరిగిందన్నారు. ఆక్సిజన్, బెడ్స్,మందులు లేక సరైన టైంలో వైద్యమందక ఎంతో మంది ఆప్తులను కోల్పోతూ ఈదేశం ఆర్తనాదాలు చేస్తుంది. ఆసుపత్రికి పోయిన రోగులు బ్రతికి ఇంటికి తిరిగి వస్తారని నమ్మకంలేక బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తూ ఐనవారు ఆవేదన, ఆందోళన చెందుతున్నారు. అప్పుసప్పు చేసి ఇల్లువాకిలి అమ్మి లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి అప్పులపాలైన భర్తకు తెలియకుండా భార్య,భార్యకు తెలియకుండా భర్త,అన్నకు తెలియకుండా తమ్ముడు,తమ్ముడికి తెలియకుండా అన్న శవాలుగా మారి పోతున్నారు.హృదయ విధారకమైన ఇలాంటి దృశ్యాలు ప్రతినిత్యం కళ్ళముందు దర్శనమిస్తున్నాయని తెలిపారు. శవాలను కాల్చడానికి, పూడ్చడానికి కూడా సరైన స్థలాలు లేక క్యూ లో పెట్టి బంధువులు ఎదురుచూస్తూ పడి గాపులు కాస్తున్నారు.కాటి సుంకం శవాన్ని కాల్చటానికి 20 నుండి 25 వేలు వసూలు చేసే దౌర్భాగ్యం అరికట్టేందుకు చేతగాని చేవలేని సన్నాసి పాలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలస్వంతం. నమో మోడీ అంటే 303 సీట్లతో పార్లమెంట్ లో పూర్తి మెజారిటీ ఇచ్చామని,కరోనా పోతుంది చప్పట్లు కొట్టమంటే కొట్టామని భారత ప్రజల ను తక్కువగా చూస్తూనే ఈదేశానికి వాడాల్సిన వాక్సిన్లు ప్రక్క దేశాలలో పంచిపెట్టిన పాలన చేతకాని ప్రధాన మంత్రి మోడీని,151 సీట్లు అసెంబ్లీలో,22 సీట్లు పార్లమెంట్ లో ఇస్తే కనీసం కరోనా పరీక్షలు చేయడం, వాక్సిన్లు అందుబాటులో కి తేవడానికి బడ్జెట్ కేటాయింపులు చేయలేని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఇంటికి ఎందుకు పంపించకూడదో ఒక్కసారి ఆలోచించండి.ఈవిధంగా ప్రజల చావులకు కారణమౌతున్న,ఈ ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని, ప్రజలు ఆలోచించ వలసిందిగా రావు సుబ్రహ్మణ్యం కోరారు.

# పొన్నూరు లో కోవిడ్ కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు

పొన్నూరు, మే 07, ప్రజాపాలన ప్రతినిధి: పొన్నూరు అర్బన్ మరియు రూరల్ మండలాలకు కోవిడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశారు. కోవిడ్ భాదితులు క్వారెంటీన్ కోసం సకల సౌకర్యాలు తో వైద్య పర్యవేక్షణ లో ఉండేవిధంగా స్థానిక నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు 150 బెడ్లతో కొత్తగా రూపొందించారు.ఈ నేపథ్యంలో కోవిడ్ కేంద్రాలను అనునిత్యం పర్యవేక్షించేవిధంగా స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య వైకాపా కార్యకర్తలను పర్యవేక్షణ కమిటీలు గా నియమించారు.

ఈ కమిటీ లు స్థానిక అధికారులను సమన్వయ పరచుకుంటూ కోవిడ్ నియంత్రణ చర్యలపై ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటారు.

అలాగే ఈ కమిటీ కోవిడ్ పై ప్రజలకు తగు సూచనలు, సలహాలతో అవగాహన కల్పిస్తూవుంటారు. నూతనంగా స్థానిక నిడుబ్రోలు జిల్లా పరిషత్ స్కూల్ లో ఏర్పాటు చేసిన క్వారంటైన్ సెంటర్ మరియు పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు అందించే సేవల పై అధికారులతో కలిసి పర్యవేక్షిస్తారు.ఇలా ప్రస్తుతం పనిచేస్తున్న శాసనసభ్యులు వారి కార్యాలయ సిబ్బందితోపాటు , ఈ కమిటీ కూడా ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుంది. కావున పొన్నూరు రూరల్ మరియు అర్బన్ ప్రజలు ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఏర్పాటు చేసిన ఈ కమిటీ సేవలు ఉపయోగించుకొని తగిన సూచనలు పొందగలరని వైకాపా కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటన లో పేర్కొన్నారు.

పొన్నూరు అర్బన్ కమిటీ లో డాక్టర్ రూత్ రాణీ 9676659499, ఆకుల వెంకటేశ్వర్లు :7780681634 షేక్ నాజర్ :9052732999, కొల్లేరు శ్రీనివాసరావు :9394144721, జెట్టి శరత్ :9848144433, ప్రగడ బాలాజీ :9440241026, ముకిరి జాకబ్ :8074737493, గేరా సంజీవ్:9866944091.

పొన్నూరు రూరల్ కమిటీ లో దానరి నారాయణరావు :9959268170, పెరికల కృష్ణమోహన్ ( పచ్చలతాడిపర్రు సర్పంచ్) :8885551042, జాలాది యానాది రావు( మామిళ్ళపల్లి సర్పంచ్ ) :9989771419, ఇక్కుర్తి మల్లికార్జునరావు ( వెల్లలూరు సర్పంచ్ ):9618398398, డాక్టర్ సాంబశివరావు: 9948819036, బొనిగల నాగమల్లేశ్వరరావు ( మన్నవ సర్పంచ్ ):9247444334, ముద్రబోయిన తిరుపతయ్య ( ఉప్పరపాలెం సర్పంచ్ ): 93931 22344, అక్కి నాగరాజు ( నండూరు సర్పంచ్ ) : 8886660989, కందుల సుబ్బారావు ( ములుకుదురు సర్పంచ్): 9912203497, పిల్లి మాణిక్యరావు( జడవల్లి సర్పంచ్ ) :6300034241, చుండూరు వీరయ్య ( తాళ్లపాలెం సర్పంచ్ ): 8886892117, మిక్కిలి యేబు ( మాచవరం సర్పంచ్ ): 8374386110, నియమింతులైనట్లు వివరించారు.

# మానవత్వం చాటుకుంటున్న మహా నీయుడు..బెల్లంకొండ కార్యదర్శి దుర్గారావు



బెల్లంకొండ: మే 07, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా మహమ్మారి మానవ సంబంధాలను దెబ్బతీస్తుంది వైరస్ తో మరణించిన వారి మృతదేహాల వద్ద అనుచితంగా ఘటనలు మనం చూస్తూనే ఉన్నాం ఇలాంటి సందర్భాల్లో తనకు మానవత్వం ఉందని నిరూపించుకున్నారు బెల్లంకొండ సచివాలయ కార్యదర్శి దుర్గారావు కరోనా తో మరణించి వారి మృత దేహాలను తనతో పాటు తన పారిశుద్ధ్య కార్మికుల తో స్వయంగా అంత్యక్రియలు జరిపి మానవత్వం చాటుకుని మనసున్న మనిషి అనిపించుకున్నారు కరోనా కాల నృత్యం చేస్తున్నా వేళ మనుషుల మధ్య బంధాలు కనుమరుగైనయి అందరు ఉన్న ఎవ్వరు లేనట్టుగా ఉంటే గ్రామ పెద్దలకు సంప్రదించి తన సిబ్బందితో ఆ కరోన మృతదేహాలను తమ పంచాయతీ వాహనంలో తీసుకుపోయి దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు అందరూ ఉండి అనాథ శవాలుగా కరోనా మృతదేహాలు ఉంటున్నాయి ఇప్పటికీ బెల్లంకొండ లో నాలుగు మృతదేహాలు పూడ్చి పెట్టడం జరిగింది ప్రతి కరోనా మృతదేహం తీసుకొని వెళ్లేటప్పుడు ముందుగా ఆ రాహదారి వెంబడి బ్లీచింగ్ శానిటైజర్ చెల్లించడం జరుగుతుంది మృతదేహాన్ని ఖననం చేసిన తర్వాత కూడా మరొకసారి రహదారి వెంట మళ్లీ స్ప్రే చేయడం జరుగుతుందని వారు తెలిపారు ఏది ఏమైనప్పటికీ బెల్లంకొండ గ్రామ ప్రజలు బెల్లంకొండ సచివాలయ కార్యదర్శి దుర్గారావు కి మరియు పారిశుద్ధ్య కార్మికులకు అభినందిస్తున్నారు.దుర్గారావు మాట్లాడుతూ కరోనా సెకండ్ వేవ్ విజృంభిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం 18 గంటల కర్ఫ్యూ నిర్వహిస్తుందని ఈ కర్ఫ్యూ వల్లనైనా కరోనా కేసులు తగ్గే విధంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ అధికారులకు సహకరించాలని అదేవిధంగా సమయము లోపే అన్ని వస్తువులు కొనుగోలు చేసి కొనుగోలు చేసేటప్పుడు ముఖానికి మాస్కు ధరించి భౌతిక దూరం పాటించాలని వారు ప్రజలను కోరారు



## టీటీడీకి సవాల్ విసిరిన కిష్కింధ దేవస్థానం

తిరుమల,మే 07 , ప్రజాపాలన ప్రతినిధి: ఆంజనేయుడి జన్మ స్థలంపై తిరుమల తిరుపతి దేవ స్థానం చేసిన ప్రకటన వివాదా స్పదమవుతోంది. హనుమంతుడి జన్మస్థలం అంజనాద్రి అని టీటీడీ ప్రకటించడాన్ని కిష్కింధ దేవస్థానం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కిష్కింధ దేవస్థానం టీటీడీకి 6 పేజీల లేఖ రాసింది. అజ్ఞానపు, మూర?పు పనులు చేయవద్దంటూ లేఖలో కిష్కింధ దేవస్థానం తీవ్రంగా మండిపడింది. టీటీడీ నివేదిక అభూతకల్పన అని తాము నిరూపిస్తామని కిష్కింధ దేవాలయ అధికారులు సవాల్ విసిరారు.

## కూరపాటి శ్రీనివాస్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో యాచకులకు వృద్ధులకు భోజనం పంపిణీ







నరసరావుపేట, మే 07 , ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట పట్టణంలో కరోనా మహమ్మారి వల్ల లాక్‌డౌన్ ప్రకటించడం జరిగింది పేదలు వృద్ధులుగా రోడ్డు పైన ఉన్న యాచకులు కు ఉచితముగా భోజనం పంపిణీ చేయడం జరుగుతుంది .ఈ సందర్భంగా కూరపాటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది పేదలు వృద్ధులు అనాథలు లాక్ డౌన్ ప్రకటించిన సందర్భంగా అనాథల ఆకలితో అలమటిస్తూ ఇబ్బంది పడుతున్నారు నరసరావుపేట చుట్టుపక్కలా ఎక్కడైనా పేద ప్రజలు కు ఉచితముగా భోజనం పంపిణీ చేయడం జరుగుతుంది ఈ లాక్ డౌన్ ఉన్నంతవరకూ ప్రభుత్వం యధావిధిగా సాగే అంతవరకు మేము ఉచితంగా పేదల ఆకలి తీరుస్తూ అందరూ మాస్కులు ధరించండి సామాజిక దూరం పాటించండి ఈ కరోనా మహమ్మారి ధైర్యంగా ఎదుర్కొందాం మని కూరపాటి శ్రీనివాస్ రెడ్డి యూత్ తెలిపారు.

# 'సంగం' సర్వర్లు హ్యాక్ అయ్యాయి : ఐటీ వింగ్




గుంటూరు, మే 07 , ప్రజాపాలన ప్రతినిధి: సంగం డెయిరీ సర్వర్‌లు హ్యాకింగ్ అయినట్లు సంస్థ ఐటీ వింగ్ గుర్తించింది. రోజువారీ కార్యకలాపాల డేటా హ్యాకింగ్‌కు గురైందని ఐటీ వింగ్ ఉద్యోగులు పసిగట్టారు. దీనిపై డెయిరీ ఐటీ వింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తక్షణమే పోలీసుల సోదాలు నిలిపివేయాలని సంగం సిబ్బంది డిమాండ్ చేశారు. సంస్థ సర్వర్ రూమ్ వద్దకు ఏసీబీ అధికారులతో పాటు పోలీసులు కూడా చేరుకున్నారు. సర్వర్లను తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సమయంలో సంస్థ ఉద్యోగులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కోర్టు ఆర్డర్స్ రాక ముందే సర్వర్లను తరలించే ప్రయత్నాలు చేస్తున్నారని యాజమాన్యం ఆరోపించింది. అయితే తమకు కోర్టు నుంచి ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు రాలేదని పోలీసులు పేర్కొంటున్నారు. మరోవైపు సంగం డైయిరీ వద్దకు మీడియాకు అనుమతిని నిరాకరించారు. ప్రస్తుతం డైయిరీ తమ ఆధీనంలో ఉందని, మీడియా వాళ్లు ఇక్కడికి రావడానికి వీల్లేదని, వెళ్లిపోవాలని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# కోవిడ్ అనుమానాస్పద మృతదేహాల నిర్వహణ-రాష్ట్ర ప్రభుత్వం సూచనలు

విజయవాడ మే 07, ప్రజాపాలన ప్రతినిధి:కోవిడ్ అనుమానాస్పద మృతదేహాల నిర్వహణ కోసం గతం లో జారీ చేయబడిన వివరణాత్మక సూచనలు మరియు ఇచ్చిన ఆదేశాలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని సూచనలు అదనముగా చేర్చి ఆదేశాలు జారీ చేసి ఈరోజు విడుదల చేసింది.రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచన మేరకు చనిపోయిన వ్యక్తి కి కోవిడ్ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష ఫలితం నెగిటివ్ గా తేలే వరకు చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు / బంధువులకు అప్పగించరు. మరణించిన వ్యక్తి ద్వారా అనవసరంగా ఇతరులకు సంక్రమణ ద్వారా వ్యాప్తి చెందకుండా ఉండటానికి ప్రభుత్వము ఈ నిర్ణయము తీసుకున్నది.ఒకవేళ చనిపోయిన వ్యక్తి యొక్క కోవిడ్ పరీక్ష ఫలితం పాజిటివ్ గా నిర్ధారణ అయితే, అప్పుడు చనిపోయిన వ్యక్తి యొక్క మృతదేహ నిర్వహణ ఈ కింది తెలిపిన ప్రోటోకాల్ ప్రకారము నిర్వహించవలసి ఉంటుంది.ఏదేని ఆసుపత్రిలో కోవిడ్ కారణము తో సంభవించి ప్రతీ మరణమును సంబంధిత హాస్పిటల్ సూపరింటెండెంట్ నిర్దేశించిన సమాచార ప్రోటోకాల్ అనుసరించి మొదటగా నియమించబడిన నోడల్ లేదా స్పెషల్ ఆఫీసర్ కు, మరియు అతని ద్వారా జిల్లా కలెక్టర్ కు తెలియ చేయబడాలి.మృతదేహ నిర్వహణకు సంబందించి హాస్పిటల్ సిబ్బందికి చేసిన సూచనలు.లిమృతదేహాన్ని వార్డు నుంచి తొలగించడానికి డ్యూటీ లో ఉన్న ఆరోగ్య కార్యకర్త తగు రక్షణ కొరకు సరైన పిపిఇ కిట్ ధరించి జాగ్రత్తగా నిర్వహించాలి.మృతదేహం యొక్క నోరు, నాసికా రంధ్రాలను మూసి వేసి మృతదేహాన్ని లీక్ ప్రూఫ్‌లో ప్లాస్టిక్ బాడీ బ్యాగ్ లో ఉంచాలి.తరువాత మృతదేహం ఉంచబడిన బాడీ బాగ్ ని మార్చు రీ షీట్ తో, లేదా మృతదేహానికి చెందిన కుటుంబసభ్యులు ఇచ్చిన వస్త్రాలను చుట్టాలి.మృతదేహాల యొక్క ఎంబామింగ్





వంటి పనులు చేయుకూడదు, మరియు వాటిని అనుమతించకూడదు.శవపరీక్షలు చేయడం, నిర్వహించడం చేయకూడదు.

మృతదేహానికి చెందిన కుటుంబసభ్యులకు మరియు బంధువులకు చేసిన సూచనలు.

మరణించిన వ్యక్తి శరీరము బాడీ బ్యాగ్ లో చుట్టబడిన తర్వాత మాత్రమే మృతదేహాన్ని బంధువులకు అప్పగించడము జరుగుతుంది.

మృతదేహాన్ని దహన లేదా బరియాల్ కి తరలించిన తరువాత, మృతదేహం తరలించిన వాహనము మరియు సిబ్బంది 1% సోడియం హైపో క్లోరైట్ తో క్రిమి సంహారకము చేసుకోవాలి.

మృతదేహానికి స్నానం చేయించడం, మృతదేహాన్ని ముద్దు పెట్టుకోవడం, కౌగిలించు కోవడం వంటివి అనుమతించబడవు.

శ్మశానవాటిక లేదా బరియాల్ మైదానంలో 20 కి మించి వ్యక్తులు సమావేశం కాకూడదు. మృతదేహం యొక్క దగ్గరి కుటుంబ కుటుంబసభ్యుల తో వైరస్ ప్రమాదము ఉంటుంది కాబట్టి అక్కడ వారితో తగిన బౌతీక దూరం పాటించండి.

వ్యక్తి కర్మకాండల నిర్వహణ నిమిత్తము బూడిదను అప్పగిస్తారు.

పైన సూచించబడిన సూచనలు అమలు చేయుటకు శ్మశాన వాటిక సిబ్బందికి తగు విధంగా అవగాహన కల్పించడం జరిగింది.

స్థానిక మున్సిపల్ అధికారులకు సూచించిన చర్యలు.

మృతదేహాన్ని బాడీ బ్యాగ్ ఉంచి ఆపై సరైన వస్త్రము తో సరిగ్గా చుట్టబడినది అని నిర్ధారించుకున్నా తరువాత మాత్రమే మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవాలి.

మృతదేహాన్ని దహన లేదా ఖననం చేయడానికి రవాణా చేసే వాహనం మరియు సిబ్బంది 1% సోడియం హైపో క్లోరైట్ తో క్రిమిరహితం చేసుకోవాలి.

సాధ్యమైనంత వరకు దహన సంస్కారాలు ఎలక్ట్రికల్ పద్ధతి ద్వారా నిర్వహించడానికి ఏర్పాటు చేయాలి.

కుటుంబ సభ్యులు కోరిన చో కర్మ కాండలు నిర్వహించుకోడానికి బూడిదను అప్పగించాలి.

ఈ కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్మశాన వాటిక సిబ్బందికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలి.

నగరం లేదా పట్టణంలో ఉన్న కోవిడ్ ఆసుపత్రులలో మరణాలు సంభవించినప్పుడు సంబంధిత నగరం లేదా పట్టణంలోని మునిసిపల్ కమిషనర్లు మృతదేహానికి బాధ్యత వహించి నిర్వహించాలి.

ఇంకా, అన్ని బోధనా ఆసుపత్రుల యొక్క సూపరింటెండెంట్లు మరణించినవారి పరీక్ష ఫలితం హాస్పిటల్ కు అనుసంధానించబడిన పరీక్ష ప్రయోగశాల నుండి వెంటనే పొందేలా ఆసుపత్రి నోడల్ ఆఫీసర్ / మేనేజర్ సులభతరం చేయాలి.

కోవిడ్ కారణంగా సంభవించే మరణాల యొక్క సరైన సమాచారం ద్వారా నిర్ధారించాలని మరియు మృతదేహాలను నిర్దేశించిన సూచనల ద్వారా నిర్వహించి వ్యాధి మరింత మందికి వ్యాప్తి చెందకుండా మునిసిపల్ అధికారులకు తగు మార్గ నిర్దేశం చేయాలని రాష్ట్రం లో ఉన్న అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించడం జరిగింది.

సి డి ఎమ్ ఎ రాష్ట్రం లో ఉన్న అన్ని కార్పొరేషన్లు మరియు మునిసిపాలిటీలు మునిసిపల్ కమిషనర్లకు తగిన సూచనలను జారీ చేస్తుంది. ఇకనుండి సి డి ఎమ్ ఎ స్టేట్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో కూడా భాగం గా ఉండి పనిచేస్తుంది.

డాక్టర్ అర్జా శ్రీకాంత్‌లి
ఏపీ కోవిడ్ నోడల్ ఆఫీసర్
ఏపీ కోవిడ్ కమాండ్ కంట్రోల్

# మావోయిస్టుల టార్గెట్ వైసీపీ...?

విశాఖపట్టణం, మే 7, :ఏజెన్సీలో గిరిజనం వైసీపీ అంటే జై కొడతారు. నాడు వైఎస్సార్ కాంగ్రెస్ సీఎం గా ఉన్నారు కాబట్టే వారంతా ఆయన్ని చూసి ఆ పార్టీకి ఓటేశారు. ఆయన దివంగతులు అయ్యాక వైసీపీని జగన్ ఏర్పాటు చేస్తే మరో పార్టీ వైపే చూడకుండా ఓటేస్తూ వస్తున్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీకి ఒకే ఒక ఎస్టీ ఎమ్మెల్యే ఉంటే మొత్తం సీట్లు అన్నీ వైసీపీ గెలుచుకుంది. ఇక 2019 ఎన్నికల్లో మొత్తానికి మొత్తం సీట్లు వైసీపీ పరం అయ్యాయి అంటేనే మన్యం వైసీపీకి ఎంతలా ప్రాణం అయిందో అర్ధమవుతోందిగా.జగన్ ఏపీలో అధికారంలోకి వచ్చాక బాక్సైట్ తవ్వకాలు జరపమని చెప్పారు కానీ ఆ దిశగా చర్యలు లేవని మావోయిస్టులు చాలా కాలంగా గుర్రుమీద ఉన్నారు. ఇక వైఎస్సార్ హయాంలో ఏజెన్సీ ముఖద్వారంలో కంపెనీని ఏర్పాటు చేసుకుని గనుల తవ్వకాలకు ఆన్ రాక్ కంపెనీ అనుమతులు తెచ్చుకుంది. దీని మీద ఎంతో పోరాటం జరిగాక అప్పటికి అది ఆగింది. తెలుగుదేశం హయాంలో కూడా చంద్రబాబు జీవో నంబర్ 97 మొదట ఇచ్చి తరువాత బాక్సైట్ తవ్వకాల మీద వెనక్కు తగ్గారు. అయినా సరే నాడు టీడీపీని మావోలు టార్గెట్ చేసి ఆ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సోమలను దారుణంగా హత్య చేశారు. ఇపుడు వైసీపీ సర్కార్ మీద మావోలు వీలు దొరికినపుడల్లా కారాలు మిరియాలూ నూరుతున్నారు. దోపిడీకే విశాఖను పాలనారాజధానిగా ప్రకటించారని కూడా మావోలు విమర్శలు చేస్తూ వస్తున్నారు.ఇక చత్తీస్ ఘడ్ లో జరిగిన దారుణ మారణ హోమం తరువాత విశాఖ మన్యం కూడా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పైగా చాలా మంది మావోయిస్టులు తలదాచుకునేందుకు విశాఖ ఏజెన్సీ చేరుకున్నారు అన్న వార్తలు కూడా అటు పోలీసులనూ ఇటు ప్రజా ప్రతినిధులనూ కలవరపాటుకు గురి చేస్తున్నాయి. విశాఖ ఏజెన్సీలో మావోలకు ఒకప్పుడు గట్టి పట్టుంది. ఇపుడు కూడా వారు బలపడేందుకు చూస్తున్నారు. చత్తీస్ ఘడ్ దురాగతం తరువాత మావోలు విశాఖ ఏజెన్సీ వైపుగా చూడడంతో పోలీసులు సైతం అప్రమత్తం అయ్యారు. ఇక వైసీపీ నేతలు అయితే మన్యం లో ఇదివరకు మాదిరిగా తిరిగేందుకు కూడా జంకుతున్నారు.వైసీపీ అధినాయకత్వం నేతలను జనాల్లోనే ఉండమంటోంది. ప్రజా సమస్యల మీద దృష్టి పెట్టమంటోంది. ఇప్పటిదాకా ఏజెన్సీలో ఎక్కడికైనా ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, శెట్టి ఫల్గుణ వంటి వారు తిరిగేవారు. అలాగే అరకు ఎంపీ మాధవి కూడా కొండలు గుట్టకు ఎక్కి మరీ అనేక కార్యక్రమాల్లో పాలుపంచుకునేవారు. అయితే ఇపుడు పోలీసుల నుంచి వస్తున్న హెచ్చరికలు సూచనలతో వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు మన్యం వైపు తొంగి చూసే పరిస్థితి లేదని అంటున్నారు. దాంతో పాటు విశాఖ ఏజెన్సీలో మావోలు మళ్ళీ తమ కార్యకలపాలను విస్తృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు అంటున్నారు. ఇదిలా ఉంటే విశాఖ ఏజెన్సీకి చెందిన 32 మంది గ్రామ వాలంటీర్లు హఠాత్తుగా తమ పదవులకు రాజీనామా చేయడం కూడా చర్చనీయాంశం అయింది. వారిని పోలీస్ ఇంఫార్మర్లుగా మావోలు అనుమానిస్తున్నారు అన్న వార్తలు కూడా వస్తున్నాయి. ఇటు పోలీసులు, అటు మావోల ధాటికి తట్టుకుని ఉద్యోగం చేయలేమని వారు చేతులెత్తేయడం కూడా అతి పెద్ద చర్చ అవుతోంది. మరి ఇలా వైసీపీ ప్రభుత్వం గిరిజనుల దగ్గరకు వెళ్లలేకపోతే రాజకీయంగా దెబ్బే అంటున్నారు. దాంతో ముందు నుయ్యి వెనక గొయ్యి అన్న చందంగా వైసీపీ నేతల పరిస్థితి తయారైంది అంటున్నారు.

# ప్రభుత్వం రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీని తక్షణమే ప్రకటించాలి

## నవతరం పార్టీ నేత డాక్టర్ గోదా రమేష్ కుమార్ డిమాండ్



నరసరావుపేట, మే 07 , ప్రజాపాలన ప్రతినిధి:ప్రభుత్వం రాష్ట్రంలో తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి కరోనా బారినపడిన ప్రతి ఒక్కరిప్రాణాన్ని కాపాడాలని నవతరం పార్టీ నరసరావుపేట పార్లమెంట్ ఇన్ ఛార్జ్ డా.గోదా రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని పల్నాడ్ రోడ్ లో గల నవతరం పార్టీ నరసరావుపేట పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి యుద్ధప్రాతిపదికన అన్ని ప్రైవేట్ హాస్పటల్స్ ను ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని కరోనా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు,మందులు మరియు పూర్తి స్థాయిలో ఉచిత వైద్యం అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికార పార్టీ నాయకులే కరోనాతో చనిపోయిన శవాల దహన సంస్కారాలకు కూడా ప్రభుత్వం సాయం అందించడంలో విఫలమైందని చర్చించుకోవడం వారి వైఫల్యాలకు నిదర్శనమని ప్రైవేట్ హాస్పటల్స్ లో కరోనా వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక ప్రభుత్వ హాస్పటల్స్ లో ఆక్సిజన్ తో కూడిన బెడ్లు దొరకక నిరుపేదలు చనిపోతున్నారని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కరోనా రోగుల వైద్యంపై దృష్ఠి సారించి వైద్యం అందేవిధంగా కృషిచేయాలని 104 నెంబర్ కు ఫోన్ చేసిన మూడుగంటలలో కరోనా రోగికి బెడ్ అందించాలని స్వయంగా చెప్పిన ముఖ్యమంత్రి మాటలను కూడా లెక్కచేయకుండా మూడు రోజులకు కూడా బెడ్ అందించలేకపోతున్నారని,ప్రైవేట్ హాస్పటల్స్ లో అత్యధిక ఫీజుల వసూళ్ళను అధికారులు తనిఖీలు చేపట్టి నియంత్రించాలని, కరోనా రోగితో పాటుగా సహాయకులకు కూడా హాస్పటల్స్ లో భోజన సదుపాయం కల్పించాలని లేని పక్షంలో కరోనా రోగులకు సహాయకులుగా ఉండే వారంతా వివిధ హొటల్స్ కు రావడం వలన కరోనా వేగంగా వ్యాప్తి చెందే అవకాశముందని కరోనా నివారణ వ్యాక్సిన్లను వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి ఇవ్వాలని కరోనా రోజు రోజుకీ విజృంభిస్తున్న క్రమంలో అందరూ వ్యాక్సిన్ల కోసం ఒకచోట గుమిగూడటం వలన కూడా కరోనా వైరస్ వ్యాప్తి వేగవంతమవుతుందని అన్ని కోవిడ్ హాస్పటల్స్ కు సరిపడా ఆక్సిజన్ పూర్తి స్థాయిలో అందేవిధంగా చర్యలు చేపట్టాలని వ్యాక్సిన్లు,ఇంజెక్షన్ల కొరత లేకుండా చూడాలని చనిపోయిన కరోనా బాధిత కుటుంబానికి రెండు లక్షల నష్టపరిహారాన్ని అందించి దహన సంస్కారాలు ఉచితంగా జరిపేవిధంగా చర్యలు చేపట్టాలని రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విశాఖపట్టణం ఫర్ సేల్..!

విశాఖపట్టణం, మే 7 :విశాఖ సుందర నగరమని ప్రశాంత నగరమని అభివృద్ధికి సంకేతమని నేతలు ప్రసంగాలు చేస్తూంటారు. కానీ ఆచరణలో మాత్రం విశాఖకు పెద్దగా చేసింది ఏదీ లేదు. పోనీ చేయకపోతే పోయే. కనీసం ఉన్న వాటినైనా కాపాడితే అదే పదివేలు అంటున్నారు విశాఖ జనం. చంద్రబాబు తప్పు చేశాడని చెప్పిన జగన్ తానూ అదే తప్పులు చేస్తే ఎలా అంటోంది మేధావి వర్గం. బంగారం లాంటి ప్రభుత్వ భూములు తెగనమ్మడమేంటని కూడా ప్రశ్నిస్తోంది.వైఎస్సార్ సీఎం గా ఉన్నపుడు విశాఖలో విలువైన వందల ఎకరాల ప్రభుత్వ భూములను వుడా సహకారంతో వేలం వేసి దాంతో ఉమ్మడి ఏపీలో పలు కార్యక్రమాలు చేపట్టారు. విశాఖకు అందులో ఫలితం ఎంత దక్కిందో తెలియదు కానీ సర్కార్ భూములు మాత్రం ప్రైవేట్ పరం అయిపోయాయి. ఇక ఇపుడు జగన్ సైతం తండ్రి బాటలోనే వెళ్తున్నారు అంటున్నారు. జగన్ విశాఖలో భూములను అమ్మకానికి పెట్టడం ద్వారా ఏం సాధిస్తారు అన్న మాట కూడా సగటు జనం నుంచి వస్తోంది.విశాఖలో లూలూ గ్రూపు భూములతో పాటు దాదాపు రెండు వందల ఎకరాలను తొలి విడతగా అమ్మకానికి పెట్టారు. అయితే దీని తరువాత సింహాచలం భూములతో పాటు మాన్సాస్ భూములు, ఇంకా వివిధ ట్రస్ట్ ల కింద ఉన్న భూములను ప్రభుత్వం వేలం వేస్తుంది అంటున్నారు. ఈ జాబితాను మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు బయటపెట్టారు. జగన్ విశాఖలో భూములను తెగనమ్ముతూంటే మేధావులు ఎందుకు నోరు మెదపరు అంటూ ఆయన గట్టిగానే నిలదీస్తున్నారు. పాలన చేతగాక ఖజనాను ఖాళీ చేశాడని, ఇపుడు భూములు అమ్మి ఖజానాను నింపుకోవాలని చూడడం దారుణమని కూడా అయ్యన్న అంటున్నారు.నిన్న జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీని పెద్ద మెజారిటీ ఏమీ రాలేదు. అధికారంలో ఉండడంతో పాటు అనేక రకాలుగా అండదండలు కలసి వచ్చి మేయర్



పీఠం బొటాబొటీ మెజారిటీతో దక్కింది. ఇపుడు స్టీల్ ప్లాంట్ ని కేంద్రం ప్రైవేట్ పరం చేస్తోంది. దానిని ఆపే ప్రయత్నం ఏదీ జగన్ చేయడంలేదు. అదే సమయంలో జగన్ కూడా తానూ రెడీ అంటూ భూములను అమ్మకానికి పెట్టడం వల్ల విశాఖ వాసుల్లో వైసీపీ సర్కార్ మీద వ్యతిరేకత పెరుగుతోంది. విశాఖను పాలనా రాజధాని జగన్ ప్రకటించారు. మరి విశాఖ అభివృద్ధి కోసం ప్రభుత్వం వద్ద ఉన్న కార్యాచరణ ఏంటని కూడా చర్చకు వస్తోంది. అన్నీ అమ్మేశాక, సర్వం ప్రైవేట్ పరం అయ్యాక జగన్ ముఖ్యమంత్రిగా విశాఖ వచ్చి కూర్చున్నా ఉపయోగం ఏంటని కూడా అంటున్నారు.

# నల్లారి రావాలంటూ... !

తిరుపతి, మే 7, :మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయాలకు గుడ్ బై చెప్పినట్లే కన్పిస్తుంది. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ కు కొంత అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఏపీలో మాత్రం లేవు. అందుకే నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్ప ఆయన తిరిగి యాక్టివ్ కారని అంటున్నారు. ఏపీలో ఇంత జరుగుతున్నా ఆయన ఏమాత్రం పట్టంచుకోవడం లేదు.మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. సరే వాటిని పక్కన పెడితే తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక జరిగింది. నల్లా?రి కిరణ్ కుమార్ రెడ్డి సొంత జిల్లా అది. ఇక్కడ కాంగ్రెస్ తరుపున చింతా మోహన్ బరిలోకి దిగారు. అయితే ఆయనను ఒంటరిని చేసి కాంగ్రెస్ నేతలంతా వదిలేసినట్లే కన్పిస్తుంది. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి ఈ నియోజకవర్గంలో కొంత పట్టుంది. ఆయన వల్ల లబ్ది పొందిన వారు కూడా అనేక మంది ఉన్నారు.కానీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తిరుపతి వైపుకూడా తొంగి చూడలేదు. కాంగ్రెస్ లో రాహుల్ గాంధీ సమక్షంలో చేరిన ఈ మాజీ ముఖ్యమంత్రి ఆర్భాటపు ప్రకటనలు చేశారు. తాను కాంగ్రెస్ ను రాష్ట్రంలో బలోపేతం చేస్తానని చెప్పారు. అంతేకాదు వెళ్లిన వారిని తిరిగి తీసుకు వస్తానని నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకూ మాజీ ఎంపీ హర్షకుమార్ తప్పించి ఎవరూ పార్టీవైపు కూడా చూడలేదు.నిజానికి తిరుపతి ఉప ఎన్నికల్లో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ తరుపున ప్రచారం చేసి ఉంటే కొద్దో గొప్పో ఊపు వచ్చేది. అధికార వైసీపీ ఓట్లకు కొంత గండి పడేది. కానీ ఆయనకు ఏమాత్రం పట్టలేదు. దీన్నిబట్టి ఆయన మరికొంత కాలం వెయిట్ చేయాలని యోచిస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ కే పరిమితమైన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తే తప్ప బయటకు రారట.

## బీజేపీ అతే... మమతకు కలిసొచ్చిందా..?



కోల్ కత్తా, మే 7,:శ్చిమ బెంగాల్ లో మమత బెనర్జీ మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు. మూడుసార్లు ఆమె సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా మమత బెనర్జీ మాత్రం చివరకు అనుకున్నది సాధించారు. ఎన్నికలకు ముందు నుంచే బీజేపీ అనేక ఇబ్బందులను పెట్టింది. మానసికంగా మమతను దెబ్బతీసింది. అయినా మమత బెనర్జీ ఏమాత్రం బెదరలేదు. తాను అనుకున్నది సాధించాలన్న లక్ష్యంతోనే ముందుకు పోయారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు మరో ఏడాది ఉండగానే బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్ ను ప్రారంభించింది. మమత బెనర్జీకి అండగా నిలిచిన వారందరినీ తన పార్టీలో చేర్చుకుంది. ముఖ్యమైన నేతలను చేర్చుకోవడంతో ఒక దశలో మమత బెనర్జీ ఇబ్బంది పడ్డారు. సువేందు అధికారి వంటి ఆర్థిక, సామాజికపరంగా బలమైన నేతలు వెళ్లిపోవడంతో మమత బెనర్జీ కుంగిపోయారు. అయినా మొక్కవోని దీక్షతో ఆమె ఎన్నికలకు సిద్ధమయ్యారు. తొలి నుంచి మమత బెనర్జీ తనకు ప్రధాన శత్రువు బీజేపీయేగానే భావించి ఎన్నికల రణ క్షేత్రంలోకి దిగారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను పట్టించుకోలేదు. ఒంటరిగానే పోటీ చేయాలని మమత బెనర్జీ నిర్ణయించుకున్నారు. వెళ్లిపోయిన నేతల స్థానంలో కొత్త నేతలను బరిలోకి దించి తన సత్తా ఏమిటో నిరూపించుకున్నారు. గతంలో కంటే ఎక్కువ స్థానాలను సాధించి బీజేపీ?కి తానేమిటో రుజువు చేశారు. బీజేపీ కూడా అతికి పోవడం వల్లనే ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింది. మమత బెనర్జీని సోలోగా టార్గెట్ చేయడం బెంగాల్ ప్రజలకు రుచించలేదు. ఒక్క మహిళ కోసం బెంగాలేతరులు ప్రయత్నిస్తున్నారన్న భావన ప్రజల్లో బలంగా పాతుకుపోయింది. అందుకే ఈ అనూహ్య విజయం లభించింది. అందుకే మమత బెనర్జీ అంచనాలకు భిన్నంగా ప్రజలు ఆమె వెంట నిలిచారు. మూడో సారి ముఖ్యమంత్రిగా మమత బెనర్జీ ప్రమాణస్వీకారం చేశారు.

# కరోనా కట్టడికి యాక్షన్ ప్లాన్ అవసరం

ప్రజారోగ్యం విషయంలో నేతలు చేతులెత్తేస్తున్నారు. బేరాలు ఆడుతున్నారు. అటు కేంద్రం నుంచి మొదలు రాష్ట్రాల వరకూ అదే తంతు. తమకు ఓట్లు వేసి నెగ్గించిన ప్రజలు తమ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతుకుతున్నారనేది నాయకుల విశ్వాసం. ఉప్పు,పప్పు,సబ్బు, నూనె, పెట్రోలు ? ఒకటనేమిటి అన్నిటిపైనా చెల్లిస్తున్న పన్నులే ప్రభుత్వం నడకకు నిధులు. ప్రభుత్వోద్యోగులు మొదలు ప్రజాప్రతినిధుల వరకూ అంతా ప్రజల సొమ్ముపైనే ఆదారపడి బతుకుతున్నారు. అయినప్పటికీ ప్రజలకు ఆక్సిజన్ అందక, పడకలు లేక దయనీయమైన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రజాపాలనకు, నియంతృత్వ పోకడల రాచరికానికి తేడా లేకుండా పోయింది. రోజువారీ మూడు లక్షల కరోనా కేసులు, మూడువేల మరణాలు నమోదు అవుతున్నాయి. ఇది అసాధారణమైన పరిస్థితి. ఒకవైపు దేశవ్యాప్త లాక్ డౌన్ విధించాలనే డిమాండ్లు వినవస్తున్నాయి. ఉచిత పథకాలతో డబ్బులు పంపిణీ చేసే నాయకులు ప్రజారోగ్యానికి పూచీకత్తు ఇవ్వలేకపోతున్నారు. కనీసం ఎప్పటిలోగా ప్రజలకు వాక్సినేషన్ పూర్తిచేస్తామనే అంశమూ ఇదమిత్థంగా చెప్పడం లేదు. అసలు వాక్సిన్ల కు నిధుల కేటాయింపులోనే రాష్ట్రం వాటా , కేంద్రం వాటా అంటూ రగడ మొదలైంది. 45 సంవత్సరాల పైబడినవారికే మేము వాక్సిన్లు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వ ధోరణి దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారి తీసింది. వాక్సిన్లు కొనడానికి మా దగ్గర డబ్బులు లేవని కొన్ని రాష్ట్రాలు మొండి కేశాయి. అటు కేంద్రమైనా, ఇటు రాష్ట్రాలైనా ఎవరి సొమ్ము , ఎవరికి ఖర్చు పెడుతున్నారు. మీ విలాసాలకు, వినోదాలకు, అవినీతికి ప్రజల సొమ్మే కదా వినియోగిస్తోంది? . ఈ నిజం పక్కన పెట్టి తామేదో సొంత డబ్బులు వాక్సిన్లకు ఇస్తున్నట్లు ప్రభుత్వాలు ఫోజు కొట్టడమే విచిత్రం. ప్రజల పన్నుల సొమ్మునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటున్నాయి. రాజకీయాలు పక్కన పెట్టి జాతీయ వాక్సినేషన్ కింద నిర్దిష్ట కాల వ్యవధిలో అందరికీ వాక్సిన్లు ఇవ్వాలి. ఇతర దేశాల్లోనూ పాలిటిక్స్ ఉంటాయి. కానీ ఎక్కడా ప్రజారోగ్యం విషయంలో రాజీ పడటం లేదు. కానీ మన దేశానికి వచ్చేటప్పటికి ఎక్కడలేని దౌర్భాగ్యం వెంటాడుతోంది. వాక్సిన్ వేస్తే మాకేమైనా ఓట్లు వస్తాయా? అన్న సంకుచిత దోరణిలో లెక్కలు వేసుకుంటున్నారేమో నాయకులు. ఓట్లకు డబ్బులు పంపిణీ, అనుచిత పథకాలే తమ అధికార సోపానాలుగా భావిస్తున్నారు. విషయ పరిజ్ఞానం లేని వాళ్లు ఏమైనా చేయవచ్చు. కానీ అన్ని తెలిసిన నాయకులు సమయం, సందర్భం కాని వేళలో పాలిటిక్స్ కు ప్రాధాన్యం ఇవ్వడం శోచనీయం. ఉపద్రవం చుట్టుముడుతుంటే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈటలరాజేందర్ ఉదంతాన్ని కెలికి తీశారు. ఆరోగ్యశాఖ మంత్రిగా సమిక్షలు చేస్తూ ఈటల కరోనా విషయంలో యాక్టివ్ రోల్ పోషిస్తున్నారు. భూకబ్జాలు, ఇతర ఆరోపణలపై విచారణలు, దర్యాప్తులు ఆగమేఘాలపై జరిపేసి శిక్షించాల్సిన ఉదంతాలు కావు. పైపెచ్చు కక్ష సాధించడానికి ఇది సమయం కాదు. సంయమనంతో చట్టం తన పని తాను చేసుకునేలా వెసులుబాటు కల్పించి ఉండాల్సింది. మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన సమయం ఇది. ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి మొదలు సీనియర్ ఐఏఎస్ ల వరకూ ఈటల ఉదంతంలో తలమునకలై పోయి ఉండటం బాధ్యతారాహిత్యమే. అందుకు ముఖ్యమంత్రినే తప్పు పట్టాల్సి ఉంటుంది. రాజేందర్ విషయంతో ఆరోగ్య సమస్య పై చర్చ పక్కదారి పట్టింది. ఉద్దేశపూర్వకంగానే తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి ఇలా చేస్తున్నారనే విమర్శలూ ముఖ్యమంత్రి ఎదుర్కోవాల్సి వస్తోంది. అంతర్జాతీయంగా ఇప్పటికే అభాసు పాలయ్యాం. కేంద్ర ప్రభుత్వంతో గతంలో విభేదించిన రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామరాజన్ వంటి వారు తమ వంతు రాళ్లు విసురుతున్నారు. అమెరికా అంటు వ్యాధుల నిపుణులు ఫౌచి అయితే ప్రత్యేకించి భారత్ లో మొత్తం వ్యవస్థలన్నీ మూసేయాలంటున్నారు. సైన్యానికి అప్పగించేయాలని సూచిస్తున్నారు. నిజానికి బారత ప్రభుత్వం రాజకీయాలను పక్కనపెట్టి స్పందిస్తే అదుపు చేయడం అసాధ్యం కాదు. అమెరికా మనదేశ జనాభాలో నాలుగో వంతు. అయినా అక్కడ కేసుల సంఖ్య మూడున్నరకోట్లు. మరణించిన వారు ఆరులక్షలు. మనదేశంలో ఇప్పటికి కేసుల సంఖ్య రెండు కోట్లు. మరణించిన వారు రెండు లక్షలు. అమెరికాలో లాక్ డౌన్ పెట్టలేదు. నెమ్మదిగా అదుపు చేసుకున్నారు. ఫౌచి వంటి వారు ఇచ్చే ఉచిత సలహాలకు క్షేత్రస్థాయి వాస్తవాలతో సంబంధం ఉండదు. భారత జీవన ప్రమాణాలు, ప్రజలస్థితిగతుల గురించి ఏమాత్రం అవగాహన లేనివారి మాటలను పట్టించుకోన క్కర్లేదు. లాక్ డౌన్ వంటి వి అమలు చేసినా సడలింపు ఇచ్చిన రెండు గంటల్లోనే ప్రజలు గుమికూడి వ్యాప్తిని తీవ్రం చేయడం గతంలో చూశాం. అందువల్ల లాక్ డౌన్ చివరి అస్త్రం మాత్రమే కావాలన్న కేంద్రం వద్ద ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏమైనా ఉందా? న్యాయస్థానాలకు అంతా సక్రమంగానే ఉందని అఫిడవిట్లు ఇవ్వడం, రాష్ట్రాలకు సలహాలు ఇవ్వడమేనా? ఇప్పుడు ఇమ్మీడియెట్ యాక్షన్ ప్లాన్ కావాలి

## ఢిల్లీలో అంబులెన్స్ ఆటోలు

న్యూఢిల్లీ, మే 7, :అంబులెన్స్ అనగానే పెద్ద వాహనమే గుర్తుకొస్తుంది. నాలుగు చక్రాలతో కూడిన వ్యాన్లు అంబులెన్స్ లుగా ఉన్నాయి. కానీ, ఆటో అంబులెన్స్ లు ఎప్పుడైనా చూశారా? కనీసం విన్నారా? అవును ఆటో అంబులెన్స్ లు కూడా వచ్చేశాయి. అదీ ఆక్సిజన్ సౌకర్యం ఉన్నవి. ఢిల్లీలో టర్న్ యువర్ కన్సర్న్ ఇన్ టూ యాక్షన్ (టీవైసీఐఏ) సంస్థ రాజ్యసభ సహకారంతో ఆటో అంబులెన్స్‌లను సిద్ధం చేసింది. దేశంలో కొవిడ్ పాజిటివ్ కేసులు రికార్డు స్థాయిలో పెరిగి ఆక్సిజన్ కొరతతో ప్రాణాలు కోల్పోతున్న సమయంలో బాధితులకు అండగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకొంది. టీవైసీఐఏ సంస్థ రాజ్యసభతో కలిసి 10 ఆటో అంబులెన్స్‌ను సిద్ధం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న కొవిడ్ పేషెంట్లను ఈ ఆటోరిక్షాల్లో ఆసుపత్రులకు చేరుస్తారు. ఈ ఆటో రిక్షాలు నిత్యం పూర్తిగా శానిటైజ్ చేసి ఆక్సిజన్‌తో అందుబాటులో ఉంచనున్నారు. ఈ విషయాన్ని టీవైసీఐఏ సంస్థ ట్విటర్ లో షేర్ చేసింది. ఈ ఆటో అంబులెన్స్ సంఖ్యను భవిష్యత్తులో మరింత పెంచేందుకు ప్రయత్నిస్తామని తెలిపింది. రూ.25 లక్షల నిధులను సమీకరించి దేశ వ్యాప్తంగా ఇటువంటి ఆటో అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామంది. భారత్ లో కరోనా సునామీ కొనసాగుతోంది. మరోసారి రోజువారీ కేసుల సంఖ్య 4లక్షలు దాటింది. నిన్న ఒక్కరోజే అత్యధికంగా 4.12 లక్షల కొవిడ్ కేసులు నమోదయ్యాయి. ఇదే తీవ్రత కొనసాగితే జూన్ 11 నాటికి కొవిడ్ మరణాలు 4.04లక్షలను దాటేస్తాయని బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ బృందం అంచనా వేసింది. ఇక అమెరికాలో వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మ్యాట్రిక్స్ అండ్ ఎవల్యూషన్ సంస్థ జులై చివరి నాటికి మృతుల సంఖ్య 10లక్షలు దాటుతుందని అంచనా కట్టింది.

స్వల్ప లక్షణాలు ఉండి,ఆక్సిజన్ అవసరం అయిన కరోనా రోగులను సరైన సమయానికి ఆసుపత్రులకు చేర్చాలనే లక్ష్యంతో ఈ ఆటో అంబులెన్స్ లు తీసుకొచ్చారు. ఈ ఆటో అంబులెన్స్ లను బుక్ చేసుకోవడానికి రెండు ఫోన్ నెంబర్లు ఇచ్చారు. 9818430043, 011-41236614 నెంబర్లకు ఫోన్ చేయాలి. త్వరలోనే ఇలాంటివి మరో 20 ఆటో అంబులన్స్ లు ఢిల్లీలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఢిల్లీలో 12,53,902 కరోనా కేసులు నమోదయ్యాయి. 11.43లక్షల మంది కోలుకున్నారు. 18వేల 063 మంది కరోనాక బలయ్యారు. 91వేల 859 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

## సినీ గ్లామర్ కు కాలం చెల్లినట్టేనా..?

చెన్నై, మే 7, :సినీ గ్లామర్ కు ఇప్పుడు రాజకీయాల్లో చోటు లేదని తెలిసిపోయింది. తమ సభల్లో మార్మోగిన చప్పట్లు, ఈలలు ఆ గ్రౌండ్ కే పరిమితమనవి, అవి పోలింగ్ కేంద్రం వరకూ రావని మరోసారి స్పష్టమయింది. తమిళనాడులో కమల్ హాసన్ పార్టీ జీరో రిజల్ట్ సాధించడం ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కనీసం కమల్ హాసన్ కూడా తాను పోటీ చేసే స్థానంలో గెలవకపోవడం సినీ హీరోలపై ప్రజల నమ్మకాన్ని చెప్పకనే చెబుతోంది. కమల్ హాసన్ సామన్యుడేమీ కాదు. విలక్షణ నటుడు ఆయన. దేశ వ్యాప్తంగా అభిమానులున్నారు. ఇక తమిళనాడులో ఆయన అభిమానులకు కొదవేమీ లేదు. రజనీకాంత్ రాజకీయాల నుంచి వెనకడుగు వేసినా కమల్ హాసన్ ధైర్యంతో ముందుకు సాగారు. బీజేపీని లక్ష్యంగా చేసుకున్నారు. తమిళనాడులోని డీఎంకే, అన్నాడీఎంకేకు తానే ప్రత్యామ్నాయం అని చాటి చెప్పారు. తృతీయ కూటమిని ఏర్పాటు చేసిన తమిళనాడు రాజకీయాల్లో కీలకంగా మారతారని కమల్ హాసన్ భావించారు. మక్కల్ నీది మయ్యమ్ పార్టీని స్థాపించన కమల్ హాసన్ కొంత దూకుడుగానే వ్యవహరించారు. మక్కల్ నీది మయ్యమ్ 142 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసింది. ఒక్క చోట కూడా విజయం సాధించలేదు. కనీసం తాను పోటీ చేసిన కోయంబత్తూరు దక్షిణ నియోజకవర్గం నుంచి కూడా ఆయన గెలుపొందలేకపోయారు. బీజేపీ అభ్యర్థి వాసతి శ్రీనివాసన్ చేతిలో 1500 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. సినీ హీరోలను తిరస్కరించడం రాజకీయాల్లో కొత్తేమీ కాదు. వారిని వెండితెరకే పరిమితం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో పవన్ కల్యాణ్ సయితం తాను పోట ?చేసిన రెండు స్థానాల్లోనూ పరాజయం పాలయ్యారు. కమల్ హాసన్ తనపై నమ్మకంతో, అభిమానంతో జనం ఓట్లు వేస్తారని భావించారు. అందుకే తాను చేపల పులుసు ఇవ్వనని, చేపల పట్టేం దుకు వలలు మాత్రమే ఇస్తానని ప్రచారం చేశారు. అయినా తమిళ ప్రజలు కమల్ హాసన్ ను తిరస్కరిం చారు. రాజకీయాల్లో సినీ గ్లామర్ కు కాలం చెల్లిపోయిందని, ఎమ్జిఆ ర్, జయలలిత, ఎన్టీఆర్ తోనే ఆ రాజకీయాలు ముగిశాయని చెప్పవచ్చు.

## టీడీపీలో మళ్లీ ఎన్టీఆర్ ఫోటో వచ్చే



గుంటూరు, మే 7, :ఏపీ ప్రధాన ప్రతిపక్షం టీడీపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు అన్నగారి నామస్మరణ పెరిగింది. పార్టీ వ్యవస్థాపకుడు.. దివంగత సీఎం..నందమూరి తారక రామారావు పేరు ఇప్పుడు మార్మోగుతోంది. వాస్తవానికి పార్టీ తరఫున ఏ కార్యక్రమం చేపట్టినా.. అన్నగారిని తలుచుకుంటారు. అన్నగారికి దండలు వేసి ..పక్కన పెడతారు. ఇక, అప్పటి నుంచి చంద్రబాబు నామ స్మరణలో మునిగితేలుతున్న విషయం తెలిసిందే. ఏ కార్యక్రమం జరిగినా.. ఇదే పరిస్థితి టీడీపీలో కనిపిస్తోంది. కానీ, ఇప్పుడు చంద్రబాబును పక్కన పెట్టి.. అన్నగారిని భుజాన వేసుకున్నారు తమ్ముళ్లు. పార్టీలో ఇటీవల ఇది ఎక్కువుగా కనిపిస్తోంది. ఇటీవల పరిషత్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం దౌర్జన్య పూరితంగా.. వ్యవహరిస్తోందని.. ఎన్నికల్లో అంగబలం, అర్ధబలం, అధికార బలం ప్రయోగించి.. గెలుస్తోందని.. సో.. తాము తప్పుకొంటున్నామని చెప్పారు. అయితే.. దీనిపై పార్టీలోనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఎప్పటి నుంచో చంద్రబాబును పూజిస్తున్న నాయకులు అశోక్ గజపతిరాజు వంటి వారు కూడా బాబు నిర్ణయాన్ని వ్యతిరేకించారు. దీంతో చంద్రబాబు మాట మార్చారు. ఇప్పుడు జరుగుతున్న పరిషత్ ఎన్నికలకు సంబంధించి గత ఏడాది బలవంతపు ఏకగ్రీవాలు జరిగాయని.. వాటిని రద్దు చేసి.. కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలని.. ఇది ఇవ్వడం లేదు కనుక బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. కానీ, చంద్రబాబు చేసిన ఈ ప్రకటన కూడా వర్కవుట్ కాలేదు. క్షేత్రస్థాయిలో నాయకులు పరిషత్ ఎన్నికలను ప్రతిష్టగా తీసుకోవడం.. ఇప్పటికే అన్నీ సిద్ధం చేసుకోవడం.. పరువుతో కూడిన వ్యవహారం కావడంతో.. వారు ఎన్నికల వైపు మొగ్గు చూపారు. అయితే.. ఎవరి ఫొటో పెట్టుకోవాలి ? అనే ప్రశ్న తలెత్తింది. విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణాల్లోనూ నాయకులకు ఈ సమస్య వచ్చింది. చంద్రబాబు ఫొటోతో వెళ్తే.. అధికార పక్షం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. అధినేత వద్దంటే.. నాయకులు కావాలంటున్నారు. అంటే.. టీడీపీలో తిరుగుబాటు వచ్చిందని.. ప్రచారం చేస్తున్నారు. దీంతో టీడీపీ నేతలు? ముఖ్యంగా పరిషత్ ఎన్నికల్లో తలపడుతున్న నాయకులు.. కొత్త ఎత్తుగడ వేశారు. ఇప్పుడు చంద్రబాబు ఫొటోలను పక్కన పెట్టి.. అన్న ఎన్టీఆర్ ఫొటోలతో ప్రచారం చేశారు. అన్నగారి సెంటిమెంటును రెచ్చగొట్టాలని యత్నించారు. ఎక్కడా చంద్రబాబు పేరును కూడా మచ్చుకైనా వినిపించకుండా.. అన్నగారి పాటలు.. అన్నగారి మాటలను మైకుల్లో వినిపిస్తు.. ప్రచారం చేశారు. ఇక, దీనిపై వైసీపీ నుంచి కూడా విమర్శలు వచ్చే అవకాశం లేదు. సో.. ఇప్పటికైతే.. టీడీపీ నేతలు ఈ వ్యూహాన్ని బాగానే అమలు చేస్తున్నా.. రాబోయే రోజుల్లోనూ ఇదే తరహా వ్యూహంతో చంద్రబాబును పూర్తిగా పక్కన పెడితే.. ఆయనకు మరిన్ని ఇబ్బందులు తప్పవుపార్టీ నేతలు ఇప్పుడేదో ఎన్టీఆర్ ఫొటో వాడడం కాదు? 1999లో చంద్రబాబు గెలిచిన తర్వాత క్రమక్రమంగా చంద్రబాబు ఎన్టీఆర్ ఫొటో పక్కన పెట్టేసి అన్ని పథకాలకు తన పేరు తగిలించుకుంటూ వచ్చారు. 2004లో పార్టీ ఓడిపోయాక మళ్లీ ఎన్టీఆర్‌ను వాడడం స్టార్ట్ చేశారు. తిరిగి 2014లో బాబు గెలిచాక ఒకటి రెండు పథకాలకు తప్పా అన్ని పథకాలకు చంద్రన్న పేరు తగిలించుకుంటూ పోయారు. ఇక ఇప్పుడు పార్టీ నేతలే చంద్రబాబు ఫొటో తీసేసి ఎన్టీఆర్ ఫొటోను వాడుకుంటున్నారు.

## మడ అడవులపై పూర్తి నివేదిక రెడీ

కాకినాడ, మే 7, :పేదలందరికీ ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాకినాడలోని మడ అడవులను ధ్వంసం చేయడంపై వివాదం అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది. ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సహా పలు సంస్థల్లో ఈ వివాదం ఉంది. దానికి తోడు తాజాగా ఐక్యరాజ్యసమితి అనుబంధ విభాగాల వరకూ ఈ వ్యవహారం వెళ్లింది. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి)లో భాగంగా సామాజిక, పర్యావరణ ప్రభావాలపై పరిశీలించే విభాగం (ఎస్ఇసియు) దీనిపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా దర్యాప్తు చేపట్టింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా యుఎన్‌డిపి నిధులతో చేపట్టిన పథకానికి తూట్లు పొడుస్తూ మడ అడవులను ధ్వంసం చేయడం, ఈ ప్రాంతంలో పూడికతీత పనులు చేపట్టడంపై వివాదం కొనసాగుతోంది. మడ అడవుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మాణాలకు పూనుకుంటోందని ఫిర్యాదులు వెళ్లడంతో ఈ సంస్థ రంగంలో దిగింది. ప్రజాస్వామ్య సంప్రదాయ మత్స్యకార్మికుల వేదికతో పాటుగా ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఆంధ్రప్రదేశ్ అనే సంఘాలు యుఎన్‌డిపికి ఫిర్యాదు చేశాయి. గ్రీన్ క్లైమేట్ ఫండ్ (జిసిఎఫ్) పేరుతో రూ.298 కోట్లతో చేపట్టిన పర్యావరణ అభివఅద్ధి కార్యక్రమాలకు ఎపి ప్రభుత్వ చర్య విఘాతం కలిగిస్తోందని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో, జిసిఎఫ్ ప్రాజెక్టు పరిరక్షణ కోసమంటూ ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించారు. గతేడాది మార్చి నెలలో లాక్‌డౌన్‌కు ముందు చేపట్టిన పనులు, లాక్‌డౌన్ సమయంలోనూ కొనసాగాయి. అప్పట్లో ఎపి ప్రభుత్వం అందరికీ ఇళ్ల స్థలాల కోసమంటూ భూములను సేకరించింది. దీనిలో భాగంగా మడ అడవుల ప్రాంతంలో సుమారు వంద ఎకరాలను పూడ్చి పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించేందుకు ప్రయత్నించిందనే ఫిర్యాదు సారాంశం. ఆ క్రమంలో మడ అడవులను ధ్వంసం చేశారని, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించారని ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఇది పెద్ద వివాదమైంది. దానిపై ఎపి హైకోర్టులో కూడా కేసులు దాఖలయ్యాయి. తాజాగా ఈ వ్యవహారంలో యుఎన్‌డిపి విచారణ చేపట్టడం చర్చనీయాంశమైంది. గ్రీన్ క్లైమేట్ ఫీల్డ్ ప్రాజెక్టులో భాగంగా దేశంలోని తీర ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, బలహీన వర్గాలకు జీవనోపాధి కల్పన కోసమంటూ మడ అడవుల పరిరక్షణకు ఈ సంస్థ ప్రయత్నిస్తోంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశాతో పాటు మహారాష్ట్రలో విస్తరించి ఉన్న 25 నిర్దేశిత ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టు విస్తరించబోతున్నారు. కోరంగి వన్యప్రాణుల అభయారణ్యం ఈ ప్రాజెక్టు పరిధిలో ఉంది. ప్రస్తుతం ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా మడ అడవులను ధ్వంసం చేశారంటూ పిటిషన్ దాఖలు కావడంతో విచారణకు పూనుకున్నారు. దీనిలో భాగంగా కాకినాడ, కోరంగి ప్రాంతాల్లో ఒక బఅందం పర్యటించబోతోంది. విచారణ కోసం నియమించిన కమిటీ ఈ ప్రాంతాన్ని పరిశీలించబోతోంది. ఫిర్యాదుదారులు, ఇతరులతో కూడా చర్చలు జరిపి వారి అభిప్రాయాలను ఇప్పటికే తెలుసుకుంది. మడ అడవుల నరికివేత విషయంపై సర్వే త్వరలోనే చేయబోతోంది. వన్యప్రాణాల జీవనానికి నష్టం జరిగిందా? అనే కోణంలో కూడా విచారణ జరగబోతోంది. వచ్చే ఏడాది జనవరిలో తుది నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. కాగా, ఈ భూములు మర అడవుల పరిధిలోనివి కావని, కాకినాడ పోర్టుకు సంబంధించినవని అధికారులు చెప్పుకొస్తున్నారు.

## పవర్ ఫుల్ వకీల్ గా మారిన సూర్య.!



కోలీవుడ్ స్టార్ హీరోస్ లో ఒకరైన సూర్య శివకుమార్ కు మన తెలుగులో కూడా మంచి క్రేజ్ ఉన్న సంగతి తెలిసిందే. మరిసూర్య ఇటీవల "ఆకాశం నీ హద్దురా" తో భారీ విజయాన్ని సొంతం చేసుకోడమే కాకుండా మంచి కం బ్యాక్ కూడా అందుకున్నారు. ఇక ఈ చిత్రం తర్వాత సూర్య నుంచి మరిన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ లను అంతా ఆశిస్తున్నా క్రమంలో రెండు పవర్ ఫుల్ సబ్జెక్ట్ లను సూర్య టేకప్ చేసాడు.మరి వాటిలో దర్శకుడు టి జె జ్ఞానవేల్ తో ప్లాన్ చేసిన సినిమా కూడా ఒకటి. అయితే ఈ చిత్రంలో సూర్య పవర్ ఫుల్ వకీల్ సాబ్ గా కనిపిస్తున్నట్టు తెలుస్తుంది. లాయర్ గెటప్ లో ఉన్న ఆన్ లొకేషన్ ఫోటోలే ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే మన సౌత్ ఇండియాలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చేసిన వకీల్ సాబ్ తో మాస్ లాయర్ ఎలా ఉంటాడో చూపించారు. మరి ఈ సూర్య సినిమా ఎలా ఉండనుందో చూడాలి.

## ఆ ఎపిసోడ్ ని ఎక్కడికో లేపేసిన ఆద్య



మెగా ఫ్యామిలీ నుంచి ఎవరైనా ఒక కొత్త ముఖం తెరకు పరిచయమైతే ఆ ఎగ్జయిట్ మెంట్ అభిమానుల్లో వేరే లెవల్లో ఉంటుంది. అందునా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ వారసులే బరిలో దిగితే ఎలా ఉంటుందో వూహించవచ్చు. ఇక జీతెలుగులో డ్రామా జూనియర్స్ లేటెస్ట్ షోకు రేణు దేశాయ్ ఒక జడ్జిగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ షో ఇప్పటికే నాలుగు సీజన్లు విజయవంతంగా సాగింది. ఇప్పుడు ఐదో సీజన్ కి దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి - గాయని సునీత- రేణు దేశాయ్ జడ్జిలుగా కొనసాగుతున్నారు. ఈసారి ఎపిసోడ్ కి ప్రదీప్ మాచిరాజు స్థానంలో యాంకర్ రవి హోస్ట్ గా కొనసాగుతున్నారు. ఐదో సీజన్ డ్రామా జూనియర్స్ - ద నెక్ట్స్ సూపర్ స్టార్% హంగామా ఒక రేంజులోనే ఉండనుందని రేణు వారసురాలు ఆద్య ఎంట్రీతో అర్థమైంది. తల్లి కూతుళ్ల ఎపిసోడ్ బ్లాస్ట్ అవ్వడం ఖాయమని ఇటీవల రిలీజ్ చేసిన ప్రోమో తెలిపింది. డ్రామా జూనియర్స్ - ద నెక్ట్స్ సూపర్ స్టార్.. మదర్స్ డే స్పెషల్ ఎపిసోడ్ ప్రసారం కానుంది. అందువల్ల ఇది వెరీ స్పెషల్. ఈసారి ఎపిసోడ్ లో పవన్-రేణు జంట కుమార్తె ఆద్య ఎంట్రీ హైలైట్ కానుంది. తాజా ప్రోమోలో ఆద్య ఎంట్రీకి వకీల్ సాబ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వస్తుంటే అభిమానులు ఎమోషనల్ గా కనెక్టయిపోయారు. ఆద్య ఎంట్రీ వేళ రేణు దేశాయ్ ఎమోషనల్ అయ్యారు. వేదికపైకి వస్తూనే ఎప్పటికీ నువ్వు నా బెస్ట్ గిఫ్ట్.. తను నన్ను అమ్మలా చూసుకుంది అంటూ కూతురికి ముద్దు పెట్టారు. ఆ వెంటనే ఆద్య కూడా మై మమ్మీ ఈజ్ బెస్ట్ మామ్ ఎవర్ అంటూ వ్యాఖ్యానిస్తూ తన తల్లిని హగ్ చేసుకున్నారు. ఇప్పుడు ఆద్య మన కోసం ఓ పాట పాడుతుంది అంటూ సింగర్ సునీత ఆహ్వానించగా.. ఆద్య ఓ హిందీ పాటను ఆలపించింది. తర్వాత సునీతతో కలిసి గొంతు కలపడం ఆసక్తిని కలిగించింది. ఓ డైలాగ్ చెప్పమని ఎస్వీకే కోరగానే.. నాకు నచ్చేవి రెండే రెండు. ఒకటి మంచి నిద్ర.. రెండు మా అమ్మ అని ఆద్య ఎమోషనల్ డైలాగ్ చెప్పింది. నా గురించి నేనే ఇంట్రడక్షన్ ఇస్తా. నా పేరు రవి. నేను ఇక్కడ హోస్టును.. అని రవి పరిచయం చేసుకోగానే.. మీ అమ్మను రవి అక్క అని పిలుస్తాడు కాబట్టి నువ్వు రవి మామ అని పిలువు అని సునీత అంటారు. కానీ ఆద్య విసిరిన పంచ్ రవికి ఓ రేంజులోనే తాకింది. మీరు మామయ్య కాదు.. తాతయ్య అంటూ అదిరిపోయే పంచ్ వేసింది ఆద్య. మొత్తానికి పవన్ వారసురాలి బుల్లితెర ఎంట్రీ ఐక్యాచర్ గా నిలిచింది. ఆద్య ఈ షోకి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

## 'థాంక్యూ' ఇటలీ షెడ్యూల్ పూర్తి.. చైతన్య - రాశీఖన్నా సెల్ఫీ..!



యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య - డైరెక్టర్ విక్రమ్ కె కుమార్ కాంబోలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ "థాంక్యూ". ఇందులో చైతూ సరసన బబ్లీ బ్యూటీ రాశిఖన్నా హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం కరోనా సెకండ్ వేవ్ కారణంగా సినిమా షూటింగులు నిలిపేస్తున్న సమయంలో 'థాంక్యూ' చిత్ర బృందం తదుపరి షెడ్యూల్ కోసం ఇటలీ వెళ్ళింది. అయితే కోవిడ్ ఎఫెక్ట్ తో షూటింగ్ రద్దు చేసుకున్నారని ఈ మధ్య వార్తలు వచ్చాయి. ఇవన్నీ అవాస్తవాలని ఇప్పుడు తేలిపోయింది. 'థ్యాంక్యూ' ఇటలీ షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేసుకుని ఇండియాకి తిరిగి వస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ షెడ్యూల్ లో నాగ చైతన్య - రాశీఖన్నా పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు తెలుస్తోంది. 'థాంక్యూ' మూవీ ఇటలీ షెడ్యూల్ పూర్తి అయ్యిందని చెబుతూ.. చిత్ర బృందం కలిసి దిగిన ఓ ఫోటోని తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేశారు. మరోవైపు షూటింగ్ లొకేషన్ లో నాగ చైతన్య - రాశిఖన్నా కలిసి దిగిన ఓ సెల్ఫీ ఫొటోని రాశి సోషల్ మీడియా మధ్యమాలలో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతోంది. కాగా 'థ్యాంక్యూ' చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు - శిరీష్ - హర్షిత్ రెడ్డి లు కలిసి నిర్మిస్తున్నారు. బీవీఎస్ రవి ఈ సినిమాకి స్టోరీ అందించడంతో పాటు డైలాగ్స్ రాస్తున్నారు. లెజెండరీ సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ వర్క్ చేస్తున్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటింగ్ చేస్తున్నారు. ఎస్ఎస్ థమన్ సంగీతం సమకూరుస్తున్నారు.



## మన పాన్ ఇండియా స్టార్స్ తో కత్రీనా రొమాన్స్

టాలీవుడ్ హీరోల్లో పలువురు బాలీవుడ్ లో కూడా మంచి గుర్తింపును దక్కించుకున్నారు. ఎంతో మంది టాలీవుడ్ స్టార్స్ బాలీవుడ్ పెద్ద ఎత్తున అభిమానులను సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా బాహుబలి సినిమా తో ప్రభాస్ బాలీవుడ్ స్టార్ హీరోలను మించిన స్టార్ డంను దక్కించుకున్నాడు. ఇక విజయ్ దేవరకొండ కూడా బాలీవుడ్ లో మంచి గుర్తింపు కలిగి ఉన్నాడు అనడంలో సందేహం లేదు. వీరిద్దరితో ప్రస్తుతం బాలీవుడ్ హాట్ బ్యూటీస్ నటించేందుకు చాలా ఆసక్తిగా ఉన్నారనే వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ హీరోయిన్స్ పలువురు టాలీవుడ్ హీరోలతో నటించేందుకు సిద్దంగా ఉన్నారు. ఇప్పటికే ప్రభాస్ తో బాలీవుడ్ బ్యూటీ శ్రద్దా కపూర్ నటించింది. ఆదిపురుష్ సినిమా లో ప్రభాస్ కు జోడీగా కృతి సనన్ నటిస్తోంది. ఇక విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న లైగర్ సినిమా లో అనన్య పాండే నటిస్తోంది. ప్రభాస్ మరియు విజయ్ దేవరకొండ తో త్వరలో కత్రీనా కైఫ్ నటించబోతుందనే వార్తలు వస్తున్నాయి. గతంలో తెలుగులో నటించిన కత్రీనా కైఫ్ మళ్లీ చాలా కాలం తర్వాత నటించేందుకు సిద్దం అయ్యింది. ప్రభాస్ తో బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సిద్దార్థ్ ఆనంద్ ఒక సినిమాను తెరకెక్కించబోతున్నాడనే వార్తలు వస్తున్నాయి. ఆ సినిమా లో హీరోయిన్ గా కత్రీనా కైఫ్ నటించబోతున్నట్లుగా తెలుస్తోంది. ప్రభాస్ తో మాత్రమే కాకుండా విజయ్ దేవరకొండతో కూడా ఒక సినిమా ను కత్రీనా కైఫ్ నటించబోతున్నట్లుగా తెలుస్తోంది. కత్రీనా మాత్రమే కాకుండా పలువురు హీరోయిన్స్ కూడా తెలుగులో నటించేందుకు సిద్దంగా ఉన్నారు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపిక పదుకునే త్వరలోనే ప్రభాస్ తో నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఒక సినిమాను చేయబోతున్న విషయం తెల్సిందే. వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తున్న మన స్టార్స్ తో కలిసి నటించేందుకు బాలీవుడ్ ముద్దుగుమ్మలు పలువురు ఆసక్తిగా ఉన్నారు. ముందు ముందు మరింత మంది హీరోయిన్స్ తెలుగు లో నటించే అవకాశం ఉందేమో చూడాలి.

## లారెన్స్ 'రుద్రన్' ఏమైపోయాడు?

ఆదుకునేందుకు ఓటీటీ ఉందని నమ్మి వెళితే నమ్మినవారిని నట్టేట ముంచి ఆనక చేతులెత్తేస్తే.. ఆ సన్నివేశం ఎలా ఉంటుందో ఇప్పుడు నిర్మాతలకు అర్థమవుతోంది. మినిమం గ్యారెంటీ ఉంటుందని నమ్మి ఓటీటీలను ప్రాధేయపడితే ఇప్పుడు పూర్తిగా రివర్సులో ఉంది వీళ్ల వ్యవహారం. ఏదైనా వెంటపడితే అంతేగా!.. క్రేజీగా కొనేవాడే అమ్మేవాడి వెంటపడినప్పుడే ఏ ఉత్పత్తికి అయినా డిమాండ్. కానీ ఇటీవల క్రైసిస్ లో తిరిగి సినిమాలన్నీ ఓటీటీ బాట పడుతున్నాయి. నిర్మాతలే ఓటీటీల వెంట పడుతుంటే సీన్ రివర్సవుతోంది. థియేట్రికల్ రిలీజ్ ఇప్పట్లో సాధ్యం కాదని నమ్మిన నిర్మాతలు దిక్కు తోచని స్థితిలో కనీసం పెట్టిన పెట్టుబడులు అయినా తిరిగి వస్తాయని భావించారు. కానీ ఓటీటీలు పెద్ద హ్యాండ్ ఇస్తున్నాయని వాళ్లు చెప్పే ధరలు ఏమాత్రం గిట్టుబాటు కాని పరిస్థితి ఉందని చెబుతున్నారు. మరోవైపు థియేట్రికల్ రిలీజ్ కోసం వేచి చూడకపోతే ఈ రంగం ఇప్పట్లో కోలుకునేట్టు లేదు. కనీసం రెండు మూడు నెలలు ఆగి ఆ తర్వాత థియేటర్లకు కావాల్సిన కంటెంట్ ఇచ్చినా ఈ రంగం మనుగడ సాధ్యమవుతుంది. కానీ ఆ సన్నివేశం ఇప్పట్లో కనిపించడం లేదు. సెకండ్ వేవ్ క్రైసిస్ ఇప్పట్లో తొలగిపోతుందా? అంటే దానిపై క్లారిటీ లేకపోవడమే ఇందుకు కారణం. బంతి తమ కోర్ట్ లో ఉన్నప్పుడే ఆడాలి! అన్న చందంగా ఓటీటీలు వ్యవహరిస్తున్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడిని అయినా వెనక్కి తెచ్చుకోలేని సన్నివేశంలో నిర్మాతలు లబోదిబోమంటున్నారు. ఓటీటీలు ఆదుకుంటాయని భావిస్తే ఇదీ సంగతి.






## అండర్ వరల్డ్ డాన్ మృతిపై ఆర్జీవీ మార్క్ ట్వీట్..!

ప్రపంచానికి కనిపించని అండర్ వరల్డ్ డాన్ ల జీవిత కథలు - హింసాత్మక నేపథ్యాల గురించి వెండితెర మీద చూపించిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. చీకటి సామ్రాజ్యాన్ని ఏలే అనేకమంది డాన్ లను ప్రేక్షకులకు పరిచయం చేసిన ఆర్జీవీ.. ఇప్పుడు అండర్ వరల్డ్ డాన్ చోటా రాజన్ కరోనా వైరస్ కారణంగా మృతి చెందడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్లు తనదైన శైలిలో స్పందించారు. తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్న అండర్ వరల్డ్ డాన్ చోటా రాజన్ కు ఇటీవల కరోనా వైరస్ సోకిన విషయం తెలిసిందే. సాయుధ పోలీసుల పర్యవేక్షణలో రాజన్ కు చికిత్స అందించినప్పటికీ.. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఢిల్లీ ఎయిమ్స్ కు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం చోటా రాజన్ ప్రాణాలు కోల్పోయాడు. రాజన్ మృతిపై ట్విట్టర్ వేదికగా స్పందించిన వర్మ.. డి కంపెనీకి చెందిన వ్యక్తి అని కూడా చూడకుండా కోవిడ్ వైరస్ చోటా రాజన్ ను చంపేసిందని పేర్కొన్నాడు.'కరోనా వైరస్ చోటా రాజన్ ను చంపేసింది. అతను %ణ%-కంపెనీకి చెందిన 2వ వ్యక్తి అని కూడా పట్టించుకోలేదు. అతను ఆ వైరస్ ను ఎందుకు షూట్ చేయలేదని నేను ఆశ్చర్యపోతున్నాను? సీరియస్లీ ఇప్పుడు దావూద్ ఇబ్రహీం ఎలా ఫీల్ అవుతున్నాడో" అని



రామ్ గోపాల్ వర్మ ట్వీట్ చేశారు. కాగా దావూద్ ఇబ్రహీం - చోటా రాజన్ ల మధ్య అంతర్యుద్ధం ఆధారంగా 2002లో ఆర్జీవీ 'కంపెనీ' అనే సినిమా తెరకెక్కించాడు. ఇప్పుడు లేటెస్టుగా డాన్ గా దావూద్ ఎలా మారాడనే కథతో '%ణ% కంపెనీ' అనే సినిమా రూపొందించాడు.

## టాలీవుడ్ పై దృష్టి పెట్టిన జయం రవి?



కోలీవుడ్ హీరోల్లో చాలామంది తమ సినిమాలు తమిళంతో పాటు తెలుగులోను విడుదలయ్యేలా చూసుకుంటున్నారు. రజనీకాంత్ .. కమలహాసన్ తో పాటు విక్రమ్ .. సూర్య .. కార్తి .. విజయ్ .. విశాల్ .. ధనుశ్ .. ఇలా అంతా కూడా తెలుగు మార్కెట్ పై తమ ప్రభావం చూపుతూనే వస్తున్నారు. తెలుగులో తమ సినిమాలు అంతగా ఆడకపోయినా ఎంత మాత్రం నిరాశపడకుండా తమ ప్రయత్నం తాము చేస్తున్నారు. తమ మార్కెట్ తో పాటు అభిమానుల సంఖ్యను పెంచుకుంటున్నారు. అయితే వాళ్లలో ఒక హీరో మాత్రం టాలీవుడ్ పై ఇంతవరకూ అంతగా ఆసక్తిని చూపలేదు ... ఆ హీరో పేరే జయం రవి. ఈ హీరో ఎవరో కాదు .. తెలుగులో కృష్ణంరాజుతో 'బావ బావమరిది' .. 'పల్నాటి పౌరుషం' వంటి సూపర్ హిట్ సినిమాలను నిర్మించిన ఎడిటర్ మోహన్ తనయుడే. అందువల్లనే ఆ రెండు సినిమాల్లో జయం రవి చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపిస్తాడు. ఆ తరువాత తమిళంలో 'జయం' సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన ఆయన ఇప్పుడు అక్కడ స్టార్ హీరోగా తన జోరు చూపుతున్నాడు. హీరోగా తన కెరియర్ ను మొదలుపెట్టిన దగ్గర నుంచి ఆయన టాలీవుడ్ పై పెద్దగా దృష్టి పెట్టినట్టుగా కనిపించదు. కానీ ఇటీవలే ఆయన కూడా టాలీవుడ్ వైపు చూస్తున్నాడు. ఇకపై తమిళంలో తాను చేసే సినిమాలు తెలుగులోను తప్పకుండా విడుదలయ్యేలా చూసుకోవాలని అనుకుంటున్నాడట. అంతేకాదు తెలుగులో స్టైలిష్ విలన్ పాత్రలు చేయడానికి కూడా తాను సిద్ధంగా ఉన్నాననే సంకేతాలు పంపుతున్నట్టుగా చెప్పుకుంటున్నారు. అటు హీరోగానే కాదు .. ఇటు విలన్ గాను మెప్పించే కటౌట్ కనుక ఆయన సక్సెస్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


**పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)**

అంబేడ్కర్ రాజనీతి మూవ్‌మెంట్ (ARM)

(A Unit of JAC Regn. No. 1047 of 2016)

Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublat Plaza, Lakdi-Ka-Pool, Hyderabad - 500 004

https://ambedkarrajaneethi.com E-mail : ambedkarrajaneethimovement@gmail.com

**ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి**

బహుజన మిత్రులారా !

జై భీమ్

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85% బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి.

అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సమస్యలను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటునారు. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాక ఆధిపత్యకులాలు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు, పూలే పోరాట పటిమతో బాబాసాహెబ్ డా॥ అంబేడ్కర్‌గారు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్థించు కుంటూ చేయి చేయి కలిపి ముందుకు సాధిద్దాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలిగించి సభ్యత్వాలను పెంపోందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.

సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.

సమసమాజ స్థాపనకు పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) ఆశయాల పట్ల అవగాహన కల్పించడానికి రండి కదలి రండి.

1. బహుజన సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా పేద వాడిని ఇంకా పేదవాడుగా.... గుడిసెలను ఇంకా పూరిగుడిసెలుగా... మురికి వాడలను ఇంకా మురికి కుపాలుగా చేస్తూ.. అల్ప సంఖ్యాక ఆధిపత్య కులాలు పరిపాలిస్తున్నారు. అందువల్ల దేశాభివృద్ధి కావాలంటే సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అత్యధిక జనాభా కలిగిన **బీసీలను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలనేది ప్రతిపాదన.**
2. మహిళలను అబలలుగా ఈ సమాజం చిత్రీకరిస్తుంది. కాబట్టి అబల కాదు సబల అని నిరూపించడానికి అన్ని రంగాల్లో **మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తుంది.**
3. ఏ కులం సమస్యలు ఆ కులం వారికే తెలుస్తాయి. కానీ 40 లక్షల జనాభా ఉన్న కులాలు ఇంకా అసెంబ్లీ మెట్లు ఎక్కలేదు. **కాబట్టి 5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి నాయకులను అసెంబ్లీకి ఎమ్మెల్యేలుగా పంపాలని ప్రతిపాదన.**
4. రిజర్వేషన్ల వల్ల రాష్ట్రం నాశనం అవుతుందని కొంతమంది అల్ప సంఖ్యాకులయిన పాలక కులాల వారు బాధపడుతున్నారు. అందువల్ల భారత రత్న బాబా సాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు భారత రాజ్యాంగ పీఠికలో ప్రతిపాదించిన సమానత్వ సిద్ధాంతం ప్రకారం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ **మీరెంతో మీకంత (మీ జనాభా ఎంతో మీకంత రిజర్వేషన్) అని ప్రతిపాదిస్తుంది.**

**ఈ ప్రతిపాదలను అంగీకరించే ప్రతి ఒక్కరూ వారి వారి కుటుంబ సభ్యులతో సహా www.ambedkarrajaneethi.com వెబ్సైట్ ద్వారా పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) లో సభ్యులుగా చేరి సమాజంలోని అందరికి అవగాహన కల్పించి, బహుజన ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకునేందుకు రండి.. కదలి రండి...**

**కమిటీల నిర్మాణం**

రెండు తెలుగు రాష్ట్రాలలో రాష్ట్ర, జోనల్, పార్లమెంట్, అసెంబ్లీ, మండల స్థాయిలలో కమిటీల నిర్మాణం జరుగుతుంది.

ఈ కమిటీలలో కనీసం 21 మంది లేదా అంతకంటే ఎక్కువమంది సభ్యులుగా ఉంటారు.

అ కమిటీలలో కనీసం ఏడు కులాలనుండి లేదా అంతకంటే ఎక్కువ కులాల నుండి ప్రాతినిధ్యం కలిగివుంటుంది

బహుజన రాజ్యాధికారం తోనే - దేశాభివృద్ధి సాధ్యం.

ఇటువంటి విలువైన అంశాలు ఇంకా ఏవైనా ఉంటే మా దృష్టికి తీసుకురండి.

పూలే-అంబేడ్కర్ రాజ్యాధికార సమితిలో భాగస్వాములుగా చేరేందుకు బహుజనులందరికీ ఆహ్వానం

జై భీమ్, జై పూలే, జై భారత్


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com